## బ్రౌన్ భాషోద్ధారకుడు - జగన్ విధ్వంసకుడు: తులసిరెడ్డి

విశాలాంధ్ర-వేంపల్లె: సిపి బ్రౌన్ భాషోద్ధారకుడైతే ముఖ్యమంత్రి జగన్ విధ్వంసకుడని పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంటు తులసిరెడ్డి పేర్కొన్నారు. వేంపల్లె కాంగ్రెస్ కార్యాలయంలో గురువారం సిబి బ్రౌన్ 224 వ జయంతి వేడుకలను ఆ పార్టీ నాయకుల నడుమ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రౌన్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లా డుతూ బ్రౌన్‌దొర ఈస్టిండియా కంపెనీ తరుపున భారతదేశంలో అధికారిగా ఉంటూ కడపలో ఇంటిని కొనుగోలు చేశారన్నారు. ఇక్కడ తెలుగు భాషను నేర్చుకుని తెలుగు భాష అభివృద్ధికి మిక్కిలి కృషి చేశార న్నారు. ఇంగ్లాండుకు వెళ్లిన తర్వాత కూడా లండన్ విశ్వవిద్యాలయంలో తెలుగు ప్రొఫెసరుగా పనిచేశారన్నారు. ఆయన జ్ఞాపకార్థం స్వర్గీయ జానమద్ది హనుమశాస్త్రి కృషితో బ్రౌన్ ఇంటిని గ్రంథాలయంగా మార్చా రన్నారు. కానీ ముఖ్యమంత్రి జగన్ మాత్రం తెలుగుభాషను దూరం చేసేందుకు కంకణం కట్టుకున్నారన్నారు. ఇప్పటికైనా జగన్ బ్రౌన్ స్ఫూర్తితో జీవో 55ను వెంటనే ఉపసంహరించుకోవాలని కాంగ్రెస్ తరు పున డిమాండ్ చేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో నాయ కులు ఉత్తన్న, రాఘవయ్య, బద్రి, రామకృష్ణ, అమర్‌నాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

## కేంద్రంలో పరిశోధనలు ఎందుకు నిర్వహించడం లేదు

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్ : జానమద్ది హనుమచ్ఛాస్త్రి కృషితో దివంగత సీఎం వైఎస్ఆర్ సహకారాలతో వైవీ యూ అనుసంధానమైన సీపీబ్రౌన్ గ్రంథాలయం భాషా పరిశోధన కేంద్రంలో నిజంగా పరిశోధ నలు జరుగుతున్నాయా.! ఎందుకు జరగటం లేదో విశ్వ విద్యాలయం అధికారులు,గ్రంథాలయం నిర్వాహకులు ప్రజలకు తెలపాలని కేంద్రం సలహా మండలి సభ్యులు జానమద్ది విజయ భాస్కర్ డిమాండ్ చేశారు. గురువారం సీపీబ్రౌన్ గ్రంథాలయంలో జరిగిన సీపీబ్రౌన్ 224 జయంతి సభలో జానమద్ది ఆవేదన వ్యక్తం చేశారు. జానమద్ది హనుమచ్ఛాస్త్రి తన కోన ఊపిరి వరకు సీపీబ్రౌన్ పరిశోధన కేంద్రం అభివృద్ధికి పోరాడారని, అవిశ్రాంతంగా విరాళాల సేకరణతో కేంద్రం ఏర్పాటుకు కృషి చేసినది సర్వులకు విదితమే అన్నారు. మహోన్నతమైన కృషితో ఏర్పడ్డ కేంద్రంలో భాషా పరిశోధనలు జరగటం లేదని, సలహా మండలి సభ్యుల సమావేశాలు నిర్వహించడం లేదని,కేంద్రం అభివృద్ధికి సీఎం జగన్ మంజూరు చేసిన 5.5 కోట్ల నిధులు రాకుండా ఎవరు అడ్డుపడుతున్నారని, సమకూర్చుకోవడానికి ఎందుకు ప్రయత్నించడం లేదని ప్రశ్నించారు. సీపీబ్రౌన్, జానమద్ది హనుమచ్ఛాస్త్రి ఆశయాలు పాటించినపుడే వారికి మనమిచ్చే నిజమైన నివాళ్ళు అన్నారు.

## యోగివేమన విగ్రహం తొలగించడం సాహిత్యాన్ని, కవులను అగౌరపరచడమే

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా టిడిపి ప్రధాన కార్యదర్శి వికాస్ హరి కృష్ణ మాట్లాడుతూ జగన్ అధికారంలోకి వచ్చినప్పుడు నుంచి విగ్రహా లు తొలగింపు, అధికార భవనాలకు పార్టీ రంగులు వేయడం పరి పాటుగా మారింది. అదే క్రమంలో నేడు కడప జిల్లా తలమానికంగా ఉన్న వైవీయూలో పరిపాలన భవనానికి ఎదురుగా ఉన్న వేమన విగ్రహాన్ని తొలగించి ఆస్థానంలో వైయస్సార్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం దుర్మార్గపు చర్య అన్నారు. విగ్రహ తొలగింపును టీడీపీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ అధికారుల అత్యుత్సాహానికి నిదర్శనమన్నారు. ఈ సమావేశంలో టీడీపీ అధికార ప్రతినిధి అమూరి బాలదాసు, పార్లమెంట్ మీడియా కో ఆర్డినే టర్ జనార్దన్, బెస్త సాధికార కమిటీ రాష్ట్ర కన్వీనర్ యాటగిరిరామ్ ప్రసాద్, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాసాపేట శివ, ఎస్సీ సెల్ పార్లమెంట్ కార్యదర్శి గద్దం శ్రీనివాసులు, ఎస్సీ సెల్ నగర అధ్యక్షుడు ఓబులేశు, విశ్వ తదితరులు పాల్గొన్నారు.

## గ్రీన్‌స్పాట్ల ఏర్పాటుకు కసరత్తు

విశాలాంధ్ర- యర్రగుంట్ల : స్థానిక పురపాలికపరిధిలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో భాగంగా మొత్తం 9 సచివాలయాల పరిధిలో 9 గ్రీన్ స్పాట్ల ఏర్పాటుకు పురపాలిక అధికారులు కసరత్తు చేస్తున్నారు. కమీషనర్ పగడాల జగన్నాథ్ సారధ్యంలో ఎన్విరాల్‌మెంట్ ఏఈ సందీప్ నేతృత్వం లో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మధుకుమార్ సచివాలయాల శానిటరీ సెక్రటరీలు ఇందుకు సంబంధించి ప్రణాళికలు రూపొందిస్తు న్నారు. పట్టణంలో 9 ప్రాంతాలను బ్లాక్‌స్పాట్‌లుగా గుర్తించారు. ఇక్కడ గ్రీన్ స్పాట్ల ఏర్పాటుకు అవసరమైన చర్యల నిమిత్తం గురు వారం కమీషనర్ జగన్నాథ్, ఎన్విరాల్‌మెంట్ ఏఈ సందీప్ చర్చించారు. బ్లాక్ స్పాట్లలోని వ్యర్థాలను తొలగించి ఆ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడమే లక్ష్యం గా చర్యలు తీసుకుంటున్నామని అధికారులు తెలిపా రు. పట్టణ పచ్చ దనం, పరిశుభ్రతలో భాగంగా గ్రీన్‌స్పాట్ల ఏర్పాటుకు చర్యలు వేగవంత మయ్యాయని వారు వివరించారు.

## స్వయం సహాయక సంఘాలకు ఆడిట్

విశాలాంధ్ర-వేముల: వేముల మండలంలో గ్రామ సమాఖ్యల ఆధ్వర్యం లో స్వయం సహాయక సంఘాలకు ఆడిట్ నిర్వహిస్తారని వైకేపీ ఏపీఎమ్ ఆంజనేయులు వెల్లడించారు. ఆ మేరకు ఆయన గురువారం వేములలో సీసీలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ శ్రీనిధి, ఉన్నత సామాజిక పెట్టుబడి, బ్యాంక్ రుణాలు, వాటర్‌షెడ్ రుణాలకు సంబంధించిన రికార్డులను సిద్ధం చేయాలన్నారు. ఈ ఏడాది మార్చి ఆఖరు వరకు ఆడిట్ నిర్వహిస్తారని తెలిపారు. ఆ మేరకు గ్రామ సమాఖ్య అసిస్టెంట్లు స్వయం సహాయక సంఘాల లీడర్లకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీసీలు రామలింగయ్య, జిలానిబాషా, నాగేశ్వరి, సావిత్రి, జ్యోతి, లీగల్ కో ఆర్డినేటరు రామాంజనేయులు, బాషా, నూర్జహాన్ పాల్గొన్నారు.

## నేడు జమ్మలమడుగులో పర్యటించనున్న ఎమ్మెల్యే

**విశాలాంధ్ర-జమ్మలమడుగు:** గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా జమ్మలమడుగు శాసన సభ్యులు మూలె సుధీర్ రెడ్డి వై యస్ ఆర్ కడపజిల్లా జమ్మలమడుగు మునిసిపాలిటీ పరిధిలోని 15 వ వార్డు లో శుక్రవారం సాయంత్రం 4.00 గంటలకు ఆంజనేయ స్వామి గుడి దగ్గర నుంచి కార్యక్రమం నిర్వహిచబడునని పార్టీ నాయకులు తెలిపారు. ఈ పర్యటన లో ఎమ్మెల్యే వార్డులోని ప్రజలు సమస్యలను తెలుసుకొని పరిష్కారానికి కృషి చేస్తారని వైస్సార్సీపీ నాయకులు తెలిపారు.

# గ్రంథాలయ వారోత్సవాలను జయప్రదం చేయండి

### పోస్టర్‌ను ఆవిష్కరించిన జడ్పీ చైర్మన్, మేయర్, గ్రంథాలయ చైర్ పర్సన్

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్ : గ్రంథాలయ వారోత్సవాలను జయప్రదం చేయాలని జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి, మేయర్ సురేష్ బాబు, గ్రంథాలయ చైర్ పర్సన్ ఉషారాణి, వేముల మండలం వైసీపీ నాయకులు వేల్పుల రామలింగారెడ్డిలు పిలుపునిచ్చారు. గురువారం మేయర్ క్యాంప్ కార్యాలయంలో గ్రంథాలయ వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో విలేకరుల సమావేశం చైర్‌పర్సన్ ఉషారాణి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఈనెల 14 నుంచి 20 వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 14వ తేదీ గ్రంథాలయ వారోత్సవాల ప్రారంభ వేడుకల సందర్భంగా జాతీయ జెండా ఎగురవేయడంతో పాటు, బాలల దినోత్సవం నిర్వహిస్తామన్నారు. 15న పుస్తక ప్రదర్శన, మాదక ద్రవ్యాల పై అవగాహన-పుస్తక పఠన ప్రాముఖ్యత గురించి నిష్ణాతులచే ప్రసంగాలు, 16న గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న ప్రముఖులు డాక్టర్ ఎస్ఆర్ రంగనాథన్, పాతూరి నాగభూషణం, అయ్యంకి వెంకటరమణయ్య వారిని స్మరించుకుంటామని, 17న కవి సమ్మేళనాలు, సెమినార్లు రచయితల సందేశాలు, 18న పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్, క్రీడా పోటీలు, 19న దిశా చట్టం, మహిళా సాధికారికత పై చర్చ, 20న వారోత్సవాల ముగింపు వేడుకలు ఐఎంఏ హాలులో నిర్వహిస్తామని చెప్పారు. ప్రజా ప్రతినిధులను, ప్రముఖులను ఆహ్వానిస్తామని పేర్కొన్నారు. గ్రంథాలయ వారోత్సవాల విజయవంతానికి చైర్ పర్సన్ తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. రూ.1.50 లక్షల విరాళాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి, కార్పొరేటర్ సూర్యనారాయణ, గ్రంథాలయ కార్యదర్శి అమీరుద్దీన్, డిప్యూటీ లైబ్రేరియన్ పవన్ కుమార్, అసిస్టెంట్ లైబ్రరీన్ బాబ్జి, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## జగన్ నోట సామాజిక మాట రావడం హాస్యాస్పదం: ఎమ్మెల్సీ బీటెక్ రవి

విశాలాంధ్ర-వేంపల్లె: ముఖ్యమంత్రి నోట సామాజిక మాట రావడం హాస్యాస్పదమని టీడీపీ ఎమ్మెల్సీ బీటెక్ రవి విమ ర్శించారు. వేంపల్లె లో టీడీపీ కార్యాల యంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పులివెందుల నియోజక వర్గంలోనే సామాజిక న్యాయం జరుగలేదన్నారు. రిజర్వేషన్ పద్ధతిలో ఎస్సీ, ఎస్టీ వర్గాల వారు పదవులు పొందలేక పోయారని ఆరోపించారు. జగన్ సామాజిక న్యాయం గురించి మాట్లాడటమంటే దెయ్యాలు వేదాలు వల్లించిన ట్లేనన్నారు. సామాజిక న్యాయం పాటించి హోమ్‌శాఖ మంత్రి పదవి ఎస్సీలకు ఇచ్చామని డబ్బాకొట్టుకోవడం శోచనీయమన్నారు.రాజ్యాంగబద్దంగా ఎన్నికైన వారికి అవకాశం ఇవ్వకుండా భయపెట్టి సెలవులపై వెళ్లేటట్టు చేసి ఇతరులకు పదవులు కట్టబెట్టారని వ్యాఖ్యానించారు. వేంపల్లె, ఇడుపులపాయ సర్పంచు పదవుల ఎంపికలో ఎస్సీలకు అన్యాయం జరిగిందని ఆరోపించారు. ఎన్నిక నామినేషన్ పత్రాలలో బోగస్ సంతకాలు చేసి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశారని ఎద్దేవా చేశారు. వేంపల్లె మండలాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి చెప్పడాన్ని తాము స్వాగతిస్తామన్నారు. అయితే పాపాఘ్ని నది నీటిని ఉపయోగించి నదీపరివాహక ప్రాంతాల రైతులకు మేలు జరిగేలా పనుల చేపట్టాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనరు రామ ముని రెడ్డి, ఫైనాన్స్ కార్పోరేషన్ మాజీ డైరెక్టరు షబ్బీర్, తెలుగు జిల్లా రైతు సం ఘం అధ్యక్షుడు బాలస్వామిరెడ్డి, ఉపాధ్యక్షుడు జగన్నాథరెడ్డి, పట్టణ అధ్యక్షు డు రమేష్, పాపిరెడ్డి, మహ్మద్, వీరభద్ర, గోటూరు నాగభూషనం, ఇలియాస్, శేషారెడ్డి, యాసిన్, షరీఫ్ అల్లాబక్స్, రవికుమార్, గోగుల మల్లికార్జున పాల్గొన్నారు.

## ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి :ఏఐటీయూసీ

విశాలాంధ్ర-అట్లూరు : ఆటో కార్మికుల సంక్షేమ పథకం ఏర్పాటు చేసి ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏఐటియుసి అట్లూరు మండల సమితి ఆధ్వర్యంలో అట్లూరు క్రాస్ రోడ్ వద్ద ఆటో కార్మికులతో కలిసి ఏఐటియుసి నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐటియుసి ఏరియా అధ్యక్షులు జిఎల్ నరసింహ, బద్వేల్ పట్టణ అధ్యక్షులు ఇర్ల నాగేష్‌లు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అనేక మంది యువత చదువుకొని ఉద్యోగ అవకాశాలు లేక స్వయం ఉపాధి కోసం ఆటో డ్రైవర్లుగా మారుతున్నారని అలాంటి వారిని మరింత ప్రోత్సహించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆటో కార్మికుల సంక్షేమ బోర్డును ఏర్పాటుచేసి ఆ బోర్డు ద్వారా వారికి కావలసిన పరికరాలను సబ్సిడీతో ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతాలలో సరైన రోడ్లు లేక గుంతలతో పోరాడుతూ ప్రయాణికులను గమ్యం చేరుస్తున్నారని వెంటనే మండల పరిధిలోని రోడ్లను మరమ్మత్తులు చేయాలని వారు కోరారు. అలాగే ఆటో కార్మికులకు పోలీసు వారు మోటార్ వెహికల్ శాఖ వారు సంయుక్తంగా ఉచిత లైసెన్స్ మేళాను నిర్వహించి అందరికీ లైసెన్స్ లు ఇవ్వాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో అట్లూర్ మండల నాయకులు నిత్యపూజ, సురేష్, రవికుమార్ తదితర కార్మికులు పాల్గొన్నారు.

## గడప గడపకు డీసీసీబీ బ్యాంక్



విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: గడప, గడపకు డీసీసీబీ బ్యాంక్‌ను తీసుకెళ్లాలన్న లక్ష్యంగా ముందుకు వెళు న్నామని డీసీసీబీ బ్యాంక్ సీఈఓ కె.రాజేంద్ర కుమార్ పేర్కొన్నారు. ప్రొద్దుటూరులోని లింగాపురం, సహకార సంఘం బ్యాంక్‌ను పరిశీలించారు. అనంతరం ఆప్కాబ్ చైర్మెన్ మల్లెల ఝాన్సీరాణిని కలిసి వివరాలు అందచేశారు. ఈ సంధర్భంగా సీఈఓ రాజేంద్రకుమార్ మాట్లాడుతూ గడప గడపకు డీసీసీబీ బ్యాంక్‌ను తీసుకెళ్లడంతో భాగంగా ప్రజవ వద్ద నుండి డిపాజిట్లు సేకరించడంతో పాటు ఇది కేవలం రైతులకు సంబంధించినది కాదని, ప్రజలందరి బ్యాంక్ అని తెలిపారు. అలాగే అన్ని మండలాల్లో డీసీసీబీ బ్యాంక్‌ల విస్తరణకు కార్యచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. గడప గడపకు డీసీసీబీ బ్యాంక్ కార్యక్రమం కడప జిల్లాతో పాటు, అన్ని మండలాల శాఖల పరిధిలో కార్యక్రమాలు బ్యాంక్ సిబ్బంది నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## సమస్యల పరిష్కరానికి కృషి :ఎమ్మెల్యే

విశాలాంధ్ర - మైలవరం : ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని జమ్మలమడుగు శాసనసభ్యులు డా. మూలే సుధీర్ రెడ్డి తెలిపారు. గురువారం సాయంత్రం మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో గడప గడపకు వైకాపా కార్యక్రమంలో చిన్నకొమెర్ల సర్పంచ్ జగదీశ్వర్ రెడ్డి తో కలిసి ఇంటిఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, సర్పంచ్ జగదీశ్వర్ రెడ్డి మాట్లాడుతు ప్రజా సంక్షేమము కోసం సీఎం జగన్ మోహన్ రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందకుంటే పార్టీలకు అతీతంగా సచివాలయంలో లేదా తన దృష్టికి తీసుకువస్తే అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరానికి కృషి చేస్తామని సర్పంచ్ భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమం లో మండల అభివృద్ధి అధికారి రామచంద్రారెడ్డి, ఆంజనేయులు, సుధీర్,విజయరావు, రెవిన్యూ ఇన్స్పెక్టర్ కరీముల్లా షైక్, మండల వైకాపా కన్వీనర్ మహేశ్వర రెడ్డి, చెరెడ్డి చెన్నకేశవ రెడ్డి,మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ శివగురివి రెడ్డి, వినయ్ కుమార్ రెడ్డి, విష్ణు వర్ధన్ రెడ్డి, యర్రబోలు భాస్కర్ రెడ్డి,రామాంజినేయులు పాల్గొన్నారు.

## రోడ్డు మరమ్మత్తు పనులు చేపట్టినందుకు ధన్యవాదాలు

విశాలాంధ్ర- కొండాపురం: సీపీఐ, ఏఐటీ యూసీ అనుబంధ సంఘాలైన ఏపీ ఆటో డ్రైవర్స్ మరియు వర్కర్స్ పిలుపుమేరకు రాష్ట్ర వ్యాప్త నిరసనలో భాగంగా రోడ్డుల పై ఉన్న గుంతలను వెంటనే పూడ్చాలని, ఆటో మరియు మోటారు వాహనాల ఈ చలానాలను భారీగా పెంచిన జీఓ నెం.21ను రద్దు చేయాలని, పెంచిన డీజిల్, పెట్రోల్, గ్యాస్, నిత్యావసర ధరలు తగ్గించాలని, డ్రైవర్స్ కు ఈ ప్రభుత్వం సంక్షేమ బోర్డు ఏర్పాటుచేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ మండల కార్యదర్శి మనోహర్ బాబు, ఏఐటీయూసీ మండల అధ్యక్షులు తారాదేవి, మండల కార్యదర్శి వెంకటరమణ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. నిరసన చేపట్టిన విశయం తెలిసిన వెంటనే స్పందించిన నేషనల్ హైవే అథారిటీ ఇంజనీరింగ్ అధికారులు వెంటనే రోడ్డు మరమ్మత్తు పనులు చేపట్టారు. రోడ్లపైన ఏర్పడిన గుంతలను తారుతో పూడ్చినందుకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు సుదర్శన్ రెడ్డి, బాబు, సుధాకర్, సురేష్, రఫి, వెంకటేష్ పాల్గొన్నారు.

## పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

**విశాలాంధ్ర - కమలాపురం :** పరిసరాలు పరి శుభ్రంగా ఉంచుకుంటే జ్వరాలు దరిచేరవని కమలాపురం మలేరియా సబ్ యూనిట్ అధికారి నాగలక్ష్మి రెడ్డి అన్నారు కె. అప్పారావు పల్లి గ్రామం లో పర్యటన కార్యక్రమం నిర్వహించారు. అధికారి నాగలక్ష్మి రెడ్డి మాట్లా డుతూ వారానికి ఒక సారి ఇళ్లలోని తొట్లు, బానలు, కుండలు శుభ్రం చేసుకోవాలని తెలిపారు. ఏఎన్ఎంలు ప్రతి రోజు గ్రామాలకు వెళ్లి జ్వరం వచ్చిన వారి నుండి రక్త పరీక్షలు చేసి ల్యాబ్‌కి పంపాలని తెలిపారు. గ్రామంలో జ్వరాలు వస్తే ఆశా కార్యకర్తలు వెంటనే పై అధికారులకు తెలపాలని పలు సూచనలు సిబ్బందికి తెలియపరచారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ వెంకట రత్నం, ఏఎన్ఎం రమణమ్మ ఆశా పాల్గొన్నారు.

## ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చెయ్యాలి: ఏఐటీయూసీ

**విశాలాంధ్ర-పోరుమామిళ్ల :** ఆటో కార్మికులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర అన్యాయం చేస్తున్నాయని, అలాగే సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పిడుగు మస్తాన్ అన్నారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ నాయకులు మస్తాన్ మాట్లాడుతూ స్థానిక షాదిఖానా ఆవరణములో ఆటో కార్మికుల సమావేశం జరిగింది. ఆటో డ్రైవర్స్ మోటారు వాహనాలకు పోలీస్, రవాణా శాఖ అధికారులు ఇస్తున్న ఇ-చలానాల, రాష్ట్ర ప్రభుత్వం ఆటో కార్యాలయంపై కక్షయాధింపుగా జి.ఓ.నెం. 21ని రద్దు చేయాలని, భారీగా పెంచిన డీజిల్, పెట్రోల్, వంట గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించాలని, ఆటో,మోటారు వాహన డ్రైవర్లకు ప్రభుత్వం సొంత గూడు కోసం, స్థలాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు అబ్దుల్ ఖాదర్, చంద్ర, గౌరవ అధ్యక్షులు ఈశ్వరయ్య, యూనియన్ నాయకులు నర్సింలు, వెంకటేశ్వర్లు, గురప్ప, లాజరు, గోపన్న, సయ్యద్ బాబు, ప్రభాకరు, రామయ్య, వీరయ్య, దిలీప్, పీరావల్లి, ఖాసిం, అధిక సంఖ్యలో కార్మికుల పాల్గొన్నారు.

# ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి

### గుంతల పడిన రోడ్లను బాగు చేయాలి ప్రజల ప్రాణాలు కాపాడాలి: ఏఐటీయూసీ

విశాలాంధ్ర-కడప రూరల్ : ఆటో డ్రైవర్స్ కు సంక్షేమ బోర్డు ఏర్పాటు కోసం ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఏఐటీయూసీ) అనుబంధం కడప నగర సమితి ఆధ్వర్యంలో కడప నగరంలోని సబ్ కలెక్టర్ ఆఫీస్ దగ్గర ఆటో డ్రైవర్లు, పెద్ద ఎత్తున ఆందోళన.నిర్వహించారు. ప్రభుత్వం ఆటోడ్రైవర్లు, పిఎఫ్, ఇఎస్ఐ, పెన్షన్ల కూడిన సమగ్ర సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఏఐటీయూసీ అనుబంధం రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా గురువారం కడప నగరంలోని సబ్ కలెక్టర్ ఆఫీస్ దగ్గర పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ కడప జిల్లా డిప్యూటీ సెక్రటరీ కేసి బాదుల్లా. ఏఐటీయూసీ కడప నగర ప్రధాన కార్యదర్శి ఉద్దే.మద్దిలేటి మాట్లాడుతూ ఆటో డ్రైవర్స్ మోటారు వాహనాలకు పోలీస్, రవాణా శాఖ అధికారులు ఇస్తున్న ఇ-చలానాల, జి.ఓ. 21ని రద్దు చేయాలని పెంచిన డీజిల్, పెట్రోల్, వంట గ్యాస్, నిత్యావసర ధరలను నియంత్రించాలని ప్రమాదకరంగా ఉన్న గోతులు, ప్యాచీల రోడ్లను పక్కాగా వేసి ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాలని అన్ని పట్టణాల్లో ఆటోలకు స్టాండ్లు, పార్కింగ్ స్థలాలు కేటాయించాలని కాలం చెల్లిన టోల్ పంజా గేట్లను తొలగించి దూర ప్రాంతాలకు వెళ్లే లారీ డ్రైవర్లకు విశ్రాంతి గదులు ఉచిత వైద్యం, సదుపాయం కల్పించాలి. ఆటో డ్రైవర్స్ మోటారు వాహన డ్రైవర్లకు ప్రభుత్వం సొంత ఇల్లు మంజూరు చేయాలని, ఉచిత విద్యా వైద్యము అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ కడప నగర అధ్యక్షుడు పిచ్చినేని సుబ్బారాయుడు, ఇన్సాఫ్ కడప నగర కార్యదర్శి మైనుద్దీన్, ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఏఐటీయూసీ అనుబంధం కడప నగర అధ్యక్షుడు పుల్లయ్య, ఏఐటీయూసీ కడప నగర నాయకులు హుస్సేన్, మల్లికార్జున, శంకర్ నాయక్, సుబ్బరాయుడు శేఖర్, ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఏఐటీయూసీ అనుబంధం కడప నగర నాయకులు, శ్రీనివాసులురెడ్డి, నాయుడు, నూరు బాషా, మల్లి, బివిరెడ్డి, కృష్ణరెడ్డి, చెన్నకేశవ రెడ్డి, సుబ్బారెడ్డి, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## ఏ.ఆర్ అదనపు ఎస్.పిగా బాధ్యతలు చేపట్టిన కృష్ణారావు

**విశాలాంధ్ర-కడప క్రైం :** ఏ.ఆర్ అదనపు ఎస్.పి గా ఎస్.ఎస్.ఎస్.వి కృష్ణారావు గురువారం జిల్లా పోలీస్ కార్యాల యంలో బాధ్యతలు చేపట్టారు. 1991 లో ఆర్.ఎస్.ఐ గా పోలీసు శాఖలో ఉద్యోగ ప్రస్థానాన్ని ప్రారంభించి గత 32 సంవత్సరాలుగా పలు విభాగాల్లో విధులు నిర్వహించారు. సి.ఎం సెక్యూ రిటీ విభాగం (ఇంటెలిజెన్స్) లో విధులు నిర్వర్తిస్తూ పదోన్నతిపై కడప ఏ.ఆర్ అదనపు ఎస్.పిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్.పి కే.కే.ఎన్ అన్బురాజన్‌ని కలిసి డ్యూటీకి సంబంధించి ఉత్తర్వులు తీసుకున్నారు.

## స్వచ్ఛ భారత్ స్ఫూర్తిని ప్రతి ఒక్కరు కొనసాగించాలి

**విశాలాంధ్ర-బ్రహ్మంగారి మఠం:** దేశంలోని ప్రతి ఒక్కరిలో స్వచ్ఛభారత్‌ను మరింత స్ఫూర్తిని కలిగిస్తోం దని, ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తే స్వచ్ఛభారత్ లక్ష్యాలను సాధించవచ్చని నెహ్రూ యువకేంద్రం జిల్లా యువ అధికారి కె.మణికంఠ పేర్కొన్నారు. గురువారం స్థానిక శ్రీ వెంకటేశ్వర జూనియర్ మరియు డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ యస్.కె.వల్లి, డైరెక్టర్ మాధవరెడ్డి, మునిరెడ్డి సారథ్యంలో కళాశాల విద్యార్థిని, విద్యార్థులతో స్థానిక వీరబ్రహ్మేంద్ర పార్క్‌లో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహిం చారు. మొదటగా పార్క్‌లోని వ్యర్థాలను చెత్తను సేకరించి పరిస రాలను శుభ్రం చేశారు. ప్లాస్టిక్ వ్యర్థాలను వేరు చేశారు. పిచ్చి మొక్కలను, రాళ్లను తొలగించి పార్క్ ప్రాంగణం అంతా పరిశుభ్రపరిచారు. ఈ కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ముండ్లపాటి చంద్రశేఖర్, ఆర్ట్స్ సొసైటీ అధ్యక్షులు యర్రంపల్లి రవి, అధ్యాపకులు శివ, బాలసుబ్బయ్య, జగన్, శారద, హరి, సుస్మిత విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు వైద్య పరీక్షలు

**విశాలాంధ్ర-బ్రహ్మంగారి మఠం:** మండల కేంద్రంలోని ప్రభుత్వ గురుకుల పాఠశాలలో గురువారం స్థానిక డా.వసంత్ కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. గురుకుల పాఠశాలలోని 34మంది విద్యార్థులకు స్కాబిస్ వ్యాధితో బాధపడుతుండగా వారికి వైద్యసేవలు అందించారు. అలాగే 19మంది విద్యార్థులు జలుగు, దగ్గు, జ్వరం, సాధారణ వ్యాధులతో బాధపడుతుండగా వారికి వైద్యసేవలు అందించి మందులను పంపిణి చేశారు. ఈ సంధర్భంగా డా.వసంత్‌కుమార్ మాట్లాడుతూ ఎక్కువ మంది పిల్లలలో స్కాబిస్ వ్యాధిని గుర్తించ డం వల్ల విద్యార్థులకు హాస్టల్ లో ఉన్న అందరి విద్యార్థులకు ఒకేసారి పెర్మత్రిన్ ఆయిట్‌మెంట్ వాడమని సూచించారు. ఈ కార్యక్రమం లో ఎంఎల్ హెచ్పి, పూజ, హెల్త్ అసిస్టెంట్ మాధవ నాయుడు, వెంకటసుబ్బయ్య, ఏఎన్ఎం జ్యోత్స్న, ఆశవర్కర్ రంగనాయకమ్మ, గురకుల పాఠశాల స్టాఫ్‌నర్స్ సుధీర్ పాల్గొన్నారు.

## సీసీ కెమెరాల ఏర్పాటు

**విశాలాంధ్ర-సిద్దవటం :** గురువారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాలుగు సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు ఎంఈఓ శంకరయ్య అన్నారు. మండల కేంద్రమైన సిద్ధవటం గ్రామ పంచాయతీ ఎగువపేటలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ముఖ్యంగా బహిరంగ ప్రదేశంలో ఉన్నందున విద్యార్థుల ప్రవర్తన, క్రమశిక్షణ పట్ల ప్రత్యేకంగా నిఘా ఉండాలని,స్టడీ వర్క్ సమయంలో తమ చదువుల పట్ల పాఠశాల మైదానంలో ఉపాధ్యాయులు తమను గమనిస్తున్నారని క్రమశిక్షణతో మెలిగేలా విద్యార్థుల విలువైన సమయాన్ని సద్వినియోగం చేసుకునేలా పాఠశాల మైదానంలో మరియు పాఠశాల మెయిన్ గేట్ వద్ద అటస్థలం వద్ద మొత్తం నాలుగు సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు మండల ఎడ్యుకేషన్ ఆఫీసర్ శంకరయ్య తెలిపారు.

## రాష్ట్ర స్థాయి పోటీలకు కమలాపురం విద్యార్థిని ఎంపిక

**విశాలాంధ్ర - కమలాపురం :** ఈనెల తొమ్మిదో తేదీన కడప నగరంలోని ఇండోర్ స్టేడియంలో జరిగిన అండర్ 17 విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచి ప్రతిభ కనబరిచిన ఆర్ రెడ్డి పావని ఆ కళాశాల కరస్పాండెంట్ సివి రాజగోపాల్ రెడ్డి ప్రిన్సిపాల్ రమణారెడ్డిలు విద్యార్థిని అభినందించారు. ఎస్ జి ఎఫ్ జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ క్రీడ పోటీలో స్థానిక పి వి ఎస్ ఆర్ ఎమ్ కళాశాల విద్యార్థిని క్రీడా పోటీలలో హాజరు కావడం జరిగిందన్నారు. రానున్న రోజుల్లో గ్రామానికి కళాశాలకు తండ్రి తండ్రులకు మంచి పేరు తీసుకురావాలని వారు ఆక్షేపించారు. ఈ కార్యక్రమంలో కళాశాల పిఈటీ ఖాదర్ రెడ్డి అధ్యాపక బృందం పాల్గొన్నారు.

## ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు కేర్ హెల్త్ ఇన్సూరెన్స్ ప్రారంభోత్సవం

**విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ :** ఏపీజీబీ బ్యాంక్ 552 శాఖలతో 10 జిల్లాలలో తమ సేవలను అందిస్తోంది. ఆ శాఖలలో వివిధ రకాల డిపాజిట్ పథకాలు, వ్యవసాయ, ఎంఎస్ఎంఈ మొదలగు రుణ పథకాలు, జీవిత బీమా పథకాలతో ప్రజలకు సేవలు అందిస్తుంది. ఖాతాదారులకు మరింత చేరువవ్వడం కోసం ఎన్నో ప్రయోజనాలతో కూడిన మరిన్ని ఉత్పత్తులను ఖాతాధారులకు అందించడం కోసం బ్యాంకు చైర్మన్ రాకేష్ కశ్యప్ 10.11.2022 తేదీన ఆరోగ్య పాలసీలలో విశిష్ట అనుభవం కల్గిన కేర్ ఆరోగ్య బీమా సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇకపై ఆరోగ్య బీమాను అతి తక్కువ ప్రీమియంతో బ్యాంక్ ఖాతాదారులకు అందించడం జరుగుతుంది. ఈ సందర్భంగా కేర్ ఆరోగ్య బీమా సంస్థ యొక్క పాలసీ బుక్లెట్‌ని బ్యాంక్ చైర్మన్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్లు, రీజనల్ మేనేజర్లు ,వివిధ డిపార్ట్మెంట్ల చీఫ్ మేనేజర్లు, కేర్ ఆరోగ్య బీమా సంస్థ యొక్క కంట్రీ హెడ్ అతుల్ సభర్వాల్, ఛానల్ హెడ్, టెర్రిటరీ మేనేజర్ బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

# విశాలాంధ్ర
## వైఎస్ఆర్ కడప జిల్లా



## గడువులోపు నిర్మాణ పనులు పూర్తి చేయాలి: కలెక్టరు

**విశాలాంధ్ర-లింగాల:** గడువులోపు అభివృద్ధి నిర్మాణ పనులను పూర్తి చేయాలని కలెక్టరు విజయరామరాజు సూచించారు. లింగాల మండలం పార్నపల్లె చిత్రావతి ప్రాజెక్టు సమీపంలో రూ.5.6కోట్ల వ్యయంతో చేపట్టిన పర్యాటక అభివృద్ధి పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడువులో పర్యాటన పనులను పూర్తి చేస్తే వచ్చే నెల డిసెంబరు 2వ తేదీన ముఖ్యమంత్రి జగన్ చేతుల మీదుగా ప్రారంభించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈ లోపు పూర్తి చేయాలని ఆయన గుత్తేదారులను ఆదేశించారు. అలాగే చిత్రావతిలో పర్యాటకుల కోసం మూడు లేదా పడవలను ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. ఆయన వెంట ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి, నీటిపారుదలశాఖ ఎస్ఈ మల్లికార్జునరెడ్డి తదితరులు ఉన్నారు.

### వేమన విగ్రహాన్ని తొలగించడం దుర్మార్గం: టీడీపీ

**విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ :** రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం మూడు న్నర ఏళ్లలో విగ్రహాలు, పేర్లు మా ర్పు పాలన సాగిస్తు న్నారని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు ఆర్.శ్రీని వాసరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వేమన విగ్రహాన్ని తొలగించడంపై శ్రీనివాస రెడ్డి గారు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమాజంలో నైతిక విలువలు, కుల వివక్ష వంటి వాటిపై జనంలో చైతన్యం తీసు కొచ్చిన ప్రజా కవి వేమన అని ఆయన కొనియాడారు. ఆయన గొప్ప తనాన్ని గుర్తించి అప్పట్లో దేశ ప్రధాని కార్యాలయం దగ్గర వేమన విగ్రహాన్ని ఏర్పాటు చేశారు అని ఆయన గుర్తు చేశారు. వేమన విశ్వవిద్యాలయ అధికారులు అత్యుత్సాహం తో వ్యవహరించి విగ్రహని తొలిగించి మరో చోటకు మార్చడం సిగ్గుచేటు, విగ్రహాల పాలన పోయి..ప్రజల సమస్యలు తీర్చే పాలన దగ్గరలోనే ఉందని..అది తెలుగుదేశం పార్టీతోనే సాధ్యం అన్నారు. ఎక్కడున్నా విగ్రహాన్ని అక్కడే ఏర్పాటు చేయాలని లేని పక్షం లో టీడీపీ తరపున ఆందోళలకు దిగుతామని ఆయన హెచ్చరించారు. జగన్ ప్రభుత్వం విగ్రహాలను మారుస్తు న్నారు..కానీ ప్రజలు జగన్ ప్రభుత్వన్ని మార్చే రోజులు దగ్గరలో నే ఉందన్నారు.

### కుష్టువ్యాధిపై ఇంటింటి సర్వే

**విశాలాంధ్ర-యర్రగుంట్ల :** కుష్టువ్యాధిపై ఈ నెల 15 నుండి డిసెంబరు 5 వరకు పీహెచ్‌సీ పరిధిలో ఇంటిం టి సర్వే జరుగు తుందని నోడల్ ఆఫీసర్ ఓబు లేసు తెలిపారు. ఆశ కార్యకర్తల తో పాటు వాలంటీర్లు (మగ వా రు) ప్రతి ఇంటి వద్దకు వెళ్లి కుష్టువ్యాధి అనుమాని తులను గుర్తిస్తారని తెలిపారు. వ్యాధిగ్రస్తులను గుర్తిం చిన పిదప ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లి డాక్టర్ల ద్వారా వైద్య పరీక్షలు చేయిస్తారన్నారు. వ్యాధి నిర్ధారణ అయితే బహుళ ఔషధ చికిత్స అందిస్తారన్నారు.

### పెన్నాకు తగ్గని నీటి విడుదల

**విశాలాంధ్ర -మైలవరం :** మండల కేంద్రమైన మైలవరం లో ఉన్న తాతిరెడ్డి నరసింహ రెడ్డి జలాశయం నుండి పెన్నా నదికి నీటిని 3225 వేల క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నట్లు జలాశయం అసిస్టెంట్ ఇంజినీర్ గౌతమ్ రెడ్డి విలేఖరులకు తెలి పారు. ఎగువున ఉన్న ఎద్దుల ఈశ్వర్ రెడ్డి జలాశయం నుండి మైలవరం జలాశయం నకు 4000 వేల క్యూసెక్కుల నీరు వస్తోందని కాబట్టి మైలవరం జలాశ యం నుండి నీటిని దిగువకు విడుదల చేస్తున్నామని తెలిపారు.కావున నది పరివాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నీటి విడుదల ఇంకా పెరిగే అవకాశం ఉందని ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

### నేడు 'ఉపాధి' బహిరంగ సభ

**విశాలాంధ్ర-దువ్వూరు :** దువ్వూరులోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో శుక్రవారం మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనులపై బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు ఏపీఓ రామచంద్రారెడ్డి తెలిపారు. 2020 ఏప్రిల్ నుంచి 2022 మార్చి వరకు 15, 16 విడతల్లో జరిగిన ఉపాధి పనులను సామాజిక తనిఖీ బృందం పది రోజుల పాటు గ్రామాల్లో పర్యటించి పరిశీ లించిందని ఆయన పేర్కొన్నారు. గ్రామ సర్పంచ్ ఆధ్వ ర్యం లో గ్రామ సభలను నిర్వహించామన్నారు. 11న జరిగే సభలో ఈ పనులను బహిర్గత పరుస్తామని పేర్కొ న్నారు. వచ్చే సంవత్సరం చేపట్టే పనులను చర్చిస్తా మ న్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొనాలని కోరారు.

### సంక్షేమ పథకాలతో మరింత అభివృద్ధి

**విశాలాంధ్ర-బి.కోడూరు :** వైఎస్సార్సీపీ అధికారంలోకి వచ్చిన మూడేళ్ళలో రాష్ట్రంలోని పేద బడుగు, బలహీన వర్గాల ప్రజలు మరింత అభివృద్ధి చెందారని ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని అంకనగొడుగునూరు ఎస్సీకాలనీ, అంక నగొడుగు నూరు, మేకవారిపల్లె ఎస్సీకాలనీలలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించి ప్రతి గడపకు తిరిగి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యేకు ప్రజలు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముందు చూపుతో ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రతి గ్రామ పంచాయ తీలో ప్రజల సౌకర్యార్థం గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు విలేజ్ క్లీనిక్‌లు ఏర్పాటు చేశారన్నా రు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ దావీదు, మండల ఉపాధ్యక్షుడు చంద్ర శేఖర్‌రెడ్డి, బికోడూరు సర్పంచ్ మునిరెడ్డి, మాజీ సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### ఇక్బాల్ కవితల్లో దేశభక్తి

**విశాలాంధ్ర-మైదుకూరు :** ప్రముఖ ఉర్దూ కవి ఇక్బాల్ కవితల్లో దేశభక్తి నిండి ఉంటుందని స్థానిక ఉర్దూ హైస్కూ ల్ హెచ్ఎం శివనారాయణమ్మ తెలిపారు. బుధవారం పాఠశాలలో కవి ఇక్బాల్ జయంతి సంద ర్భంగా ఆయన చిత్రపటం వద్ద హెచ్ఎం, ఉపాధ్యా యులు, విద్యార్థులు నివాళి అర్పించారు. అనంతరం హెచ్ఎం మాట్లాడుతూ ఇక్బాల్ రాసిన 'సారే జహాసే అచ్ఛా' దేశంలో ప్రఖ్యాతి పొందిందన్నారు. ఉర్దూ కవి, ఉపాధ్యాయుడు సత్తార్ ఫైజీ మాట్లాడుతూ విద్యార్థులు మన దేశ కవుల, రచయితల గురించి తెలుసుకోవాలని తెలిపారు. 'ఇక్బాల్ దేశ భక్తి గీతాలు' అనే అంశం పై విద్యార్థులకు పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు.

## అభివృద్ధి పనులను పరిశీలించిన కలెక్టరు

**విశాలాంధ్ర-పులివెందుల టౌన్:** పులివెందుల పట్టణంలో నిర్మాణదశలో ఉన్న అభివృద్ధి పనులను గురువారం కలెక్టరు విజయరామరాజు పరిశీలించారు. ఈ సందర్భంగా పనులు స్థాయి వివరాలను అడిగి తెలుసుకున్నారు. వీలైనంత త్వరలో గడువు లోపు పనులను పూర్తి చేయాలని ఆయన గుత్తేదారులను ఆదేశించారు. ఆయన వెంట ఓఎస్డీ అనిల్‌కుమారరెడ్డి, కమిషనరు నరసింహారెడ్డి, వైసీపీ మున్సిపల్ ఇనఛార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ వరప్రసాద్, తహశీల్దార్ మాధవకృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

### ఉల్లి రైతులను తక్షణమే ఆదుకోవాలి: కాంగ్రెస్

**విశాలాంధ్ర-పులివెందుల టౌన్:** జిల్లా వ్యాప్తంగా అధిక వర్షాలకు తీవ్రంగా నష్ట పోయిన ఉల్లి రైతులను తక్షణమే ఆదుకో వాలని కాంగ్రెస్‌పార్టీ పులివెం దుల నియోజ కవర్గ ఇన్‌చార్జి వేలూరు శ్రీనివాసరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశా రు. స్థానిక కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడు తూ ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా సుమారు13వేల పైచిలుకు ఎకరాలు, పులివెందుల నియోజక వర్గ పరిధిలో దాదాపు 4188 ఎకరాలల్లో రైతులు ఉల్లి పంట వేశారన్నారు. అయితే దిగుబడి చేతికందే సమయానికి విపరీతమైన వానలు రావడంతో ఉల్లి రైతులకు దిక్కు తెలియని పరిస్తితి ఎదురైందన్నారు. ఈ వానలకు వ్యాపారులు కూడా కొనుగోలుకు ముందుకురాలేదన్నారు. దీంతో వేలాది రూపాయలు వెచ్చించి సాగు చేసిన ఉల్లి పంటను కొంత మంది రైతులు పొలంగట్టపైనే వదలేయడం, మరికొంత మంది రైతులు దుక్కులకు పనిచెప్పడం, ఇంకా కొంత మంది రైతులు మూగజీవాలకు పంటను అప్ప గించడం హృదయ విదారకమన్నారు. ఇలాంటి పరిస్థితులలో ఉల్లి రైతులను ఆదుకోవా ల్సిన బాధ్యత ప్రభుత్వంపైనేఉందన్నారు. నష్టపోయిన ప్రతి రైతును గుర్తించి వారికి పూర్తిస్థాయి పరిహారంతో పాటు తదుపరి సాగు చేసుకునేందుకు ఉచితంగా విత్తనాలు, ఎరువులు అందివ్వాలని కాంగ్రెస్‌పార్టీ తరుపున డిమాండ్ చేస్తున్నట్లు శ్రీనివాసరెడ్డి వెల్లడించారు.

### వ్యక్తిని శక్తిగా మార్చే ఆయుధమే క్రీడ
#### జిల్లా స్థాయి క్రీడల్లో బీరం విద్యార్థులు

**విశాలాంధ్ర-చెన్నూరు :** కడప డి ఎస్ ఏ ఆధ్వర్యం లో మున్సిపల్ మైదాన ఆవరణంలో జరిగిన ఎస్‌జిఎఫ్ఐ జిల్లా స్థాయి క్రీడల్లో బీరం శ్రీధర్ రెడ్డి విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. బ్యాట్మెంటన్ అండర్-14 విభాగంలో 9వ తరగతి చదువుతున్న ఎన్. సుదీప్ రెడ్డి అనే విద్యార్థి జిల్లా స్థాయిలో బంగారు పతకం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు.అలాగే చదరంగం అండర్-17 విభాగంలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న పి.కేదార్నాథ్ అనే విద్యార్థి జిల్లా స్థాయిలో నాలుగవ స్థానం, ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న పి. ఓబుల్ రెడ్డి ఆరవ స్థానాన్ని కైవసం చేసుకుని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అదేవిధంగా కడప వైవీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి సీనియర్ కోకో క్రీడలలో పదవ తరగతి విద్యార్థు లు ఎం. కీర్తి రెడ్డి మరియు ఎం. భవిత విజయం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా బీరం విద్యాసంస్థల అధినేత బీరం సుబ్బారెడ్డి, చైర్ పర్సన్ సరస్వతమ్మ విద్యార్థులను అభినందిస్తూ రాష్ట్ర స్థాయి పోటీల్లో కూడా వారు విజేతలుగా నిలిచి జిల్లా పేరును రాష్ట్రస్థాయిలో మారు మోగించాలని ఆశీర్వదించారు. ఈ విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన పవన్,చెన్నయ్య, రమేష్, ఉమామహేశ్వరీలను అభినందించారు. ఈ కార్యక్రమంలో బీరం విద్యాసంస్థల డైరెక్టర్ శ్రీమతి స్వాతి శ్రీకాంత్, ప్రిన్సిపల్ శ్వేతా పాల్గొని విద్యార్థులను అభినందించారు.

### అబుల్ కలాం ఆజాద్ జయంతి ఘనంగా నిర్వహించాలి

**విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ :** స్వతంత్ర భారతదేశ మొట్ట మొదటి విద్యాశాఖ మంత్రి "భారతరత్న" జనాబ్ మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి ప్రతి సంవత్సరం 11 నవం బర్ న " జాతీయ విద్యా దినం" గా నిర్వహించటం ఆనవా యితీ గా జరుగుచు న్నది. కాని అబుల్ కలాం స్వాతంత్ర్య సమర యోధుడిగా, మహాత్మా గాంధీ, నెహ్రూ, వల్లభ్ భాయ్ పటేల్, అంబేద్కర్ సహచరుడుగా స్వాతంత్ర్య ఉద్యమంలో దేశానికి చేసిన సేవలకు, స్వతంత్ర భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రిగా, విద్యా రంగంలో ఆయన తెచ్చిన సంస్కరణలకు తగినంత ప్రాముఖ్యత, ప్రచారం లభించటం లేదు. ఈ సంవత్సరం నుంచైనా అబుల్ కలాం జయంతి జాతీయ విద్యాదినం అయిన 11 నవంబర్‌న మొక్కుబడిగా కాకుండా అబుల్ కలాం ప్రవేశ పెట్టిన విద్యా సంస్కరణ ల గురించి తెలిసే విధంగా ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేస్తు న్నట్లు తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి షేక్ జియాఉద్దీన్ తెలిపారు.

### అర్హత కలిగిన ప్రతి రైతుకు డ్రిప్ పరికరాలు

**విశాలాంధ్ర-వేముల:** అర్హత కలిగిన ప్రతి రైతుకు ప్రభుత్వం డ్రిప్ పరికరాలను అంద జేస్తుందని ఎం పీపీ చల్లా గంగాదేవి పేర్కొన్నారు. వేముల ఆర్‌బికె వద్ద ప్రభు త్వం 90శాతం రాయితీతో అంద జేస్తున్న డ్రిప్ పరికరాల పంపిణీ ప్రక్రియను గురువారం ఆమె జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐదెకరాలోపు భూమి ఉన్న రైతులకు 90శాతం రాయితీపైన, అలాగే ఐదెకరాలకు పైబడిన రైతులకు 70శాతం చొప్పున రాయితీపై డ్రిప్ పరికరాలను ప్రభుత్వం అందజేస్తుందన్నారు. రైతులకు 90శాతం రాయితీపై ముఖ్యమంత్రి జగన్ నేతృత్వంలో డ్రిప్ పరికరాలు అందజేయడం గొప్ప విషయమన్నారు. ఎపిఎమ్ఐసి పీడీ రవీంద్రనాథ్‌రెడ్డి, జెడ్పీటీసీ కె బయపురెడ్డి, వైసీపీ మండల కన్వీనరు నాగేళ్ల సాంబశివారెడ్డి, ఎంపీడీఓ విజయరాఘవరెడ్డి, ఉద్యాన అధికారి రాఘవేంద్రారెడ్డి, ఏఓ చెన్నారెడ్డి, కంపెనీ ప్రతినిధి సునిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర కీలకం: ఎస్పీ అన్బురాజన్

**విశాలాంధ్ర-కొండాపురం:** శాంతి భద్రతల పరిరక్షణలో, నేరాలను అరికట్ట డంలో పోలీసుల పాత్ర ఎంతో కీల కం అని, పోలీసులు విధి నిర్వహణలో ఎంతో జాగ్రత్తగా ఉండాలని జిల్లా ఎస్పీ అన్బురాజన్ పేర్కొన్నారు. సాధారణ తనిఖీల్లో భాగంగా గురువారం కొండాపురం పోలీస్‌స్టేషన్‌ను జిల్లా ఎస్పీ అన్బురాజన్ తనిఖీ చేశారు. ఈ సంధర్భంగా ఆయన స్టేషన్‌లో రికార్డులు, నేర వివరాలు, గ్రామాల్లో ఫ్యాక్షన్ వివరాలు, రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడే వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలని తదితర వాటి గురించి వివరాలు పరిశీలించారు. స్టేషన్ ఆవరణంలో చెట్లు పెంచాలని, పరిసరాలు పరిశు భ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కొండాపురం సర్కిల్ ఇన్స్‌పెక్టర్ సుదర్శన్ ప్రసాద్, ఎస్ఐ సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

### కార్తీకంలో ఉసిరిచెట్టు ప్రత్యేకం

**విశాలాంధ్ర-తొండూరు:** ఔషదగుణాల సిరి ఏదంటే ఉసిరి చెట్టు ఠక్కున గుర్తుస్తుం ది. ఈ ఉసిరి చెట్టు కార్తీకమాసంలో ప్రత్యేకతను చాటుతుంది. సాధారణంగా బిపి, షుగర్ దీర్ఘకాలిక వ్యాధి గ్రస్తులకు ఉసిరికాయలు దివ్య ఔషదంగా పనిచేస్తాయని వైద్యులు కూడా చెబుతున్నారు. కార్తీకమాసంలో ఉసిరి చెట్టుకింద వనభోజనాలు చేస్తారు. అంటే కార్తీకమాసంలో పార్వతీ పరమేశ్వరులు ఉసిరి చెట్టుకింద ఉంటారని విష్ణుపురాణం చెబుతోంది. దేవదానవ సంగ్రామంలో రాలిన కొన్ని అమృత బిందువులే ఈ ఉసిరి చెట్ల సంపద అనే కథ కూడా వాడుకలో ఉంది. అందుకే కార్తీకమాసంలో ఉసిరిచెట్టు కింద వనభోజనం చేస్తే పుణ్యం లభిస్తుందని, సకల దోషాలు తొలగిపోతాయని భక్తులు విశ్వసిస్తారు. ఏది ఏమైనా కార్తీకమాసంలో ఉసిర చెట్టు ప్రత్యేక చాటుతుందని చెప్పడంలో సందేహమేలేదు.

### నరేంద్రమోడీ గోబ్యాక్ .. నేడు నిరసన ర్యాలీ

**విశాలాంధ్ర-కడప రూరల్ :** విశాఖపట్నం వస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ పర్యటన సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా సీపీఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమంలో భాగంగా నేడు శుక్రవారం నిరసన ర్యాలీ చేపడుతున్నట్లు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు గా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి. ఈశ్వరయ్య, జిల్లా కార్యదర్శి గాలి చంద్ర హాజరవుతున్నట్టు సిపిఐ నగర సహాయ కార్యదర్శి కే.సి.బాదుల్లా తెలిపారు. రాష్ట్రానికి ఒకే ఒక పెద్ద ప్రభుత్వ పరిశ్రమ విశాఖ స్టీల్ ప్లాంట్‌ని ప్రైవేట్ పరం చేయొద్దని ప్రభుత్వ ఆధీనంలో ఉంచాలన్నారు. కడప స్టీల్ ప్లాంట్ నిర్మించాలని విభజన హామీ చట్టంలో ఉన్న ఉత్తరాంధ్ర, రాయలసీమ వెనకబడిన ప్రాంతాలకి నిధులు కేటాయించాలన్నారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ నేడు (11-11-2022) కడప ఆర్డీవో కార్యాలయం నుంచి జరిగే నిరసన ర్యాలీలో నాయకులు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

### మురుగు కాలువలపై ర్యాంపులు

**విశాలాంధ్ర-యర్రగుంట్ల :** స్థానిక పురపాలిక పరిధిలోని వలసపల్లె రస్తాలో ఇటీ వల నిర్మించిన సిమెం టు రోడ్డు, మురుగు కాలువలపై ర్యాంపుల ను ఏర్పాటు చేస్తున్నా రు. ఈ ప్రక్రియకు సంబంధించి ప్రతిపాద నలు సిద్ధమయ్యాయి. ఈ రస్తాలో నూత నంగా సిమెంటు రోడ్డు ఏర్పాటు కావడంతో పలు వీధులకు వెళ్లే మార్గాలు ఎత్తుగా మారాయి. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవు తున్నారు. పురపాలిక అధికా రులు ర్యాంపులను ఏర్పాటు చేయడం ద్వారా మార్గాల ను సుగుమం చేయాలని భావించారు. ఆ మేరకు వలసపల్లె రస్తాలో 20చోట్ల ర్యాంపు లను ఏర్పాటు చేయనుండగా వినాయకనగర్ పక్కవీధిలో మురుగుకాలువపై ర్యాంపు ఏర్పాటు చేసి ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా సౌకర్యం కల్పించారు. ఈ పనులను త్వరలోనే చేపట్టి పూర్తి చేయనున్నట్లు కమీషనర్ జగన్నాథ్, ఏఈ సందీప్ తెలిపారు.

### అరుణాచలానికి ప్రత్యేక బస్సులు

**విశాలాంధ్ర-మైదుకూరు :** కార్తీక మాసాన్ని పురస్కరించుకుని మైదుకూరు డిపో నుంచి తమిళనాడులోని అరుణాచలం క్షేత్రానికి ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నట్టు ఆర్టీసీ డీఎం ఎస్.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. భక్తుల సౌకర్యం కోసం మైదుకూరు డిపో నుంచి నడిపే బస్సు పోరుమామిళ్ల నుంచి ఈ నెల 13వ తేదీ (ఆదివారం) రాత్రి, 20న (ఆదివారం, రాత్రి 8 గంటలకు ప్రారంభమవుతుందని ఆయన పేర్కొన్నారు. మైదుకూరులో రాత్రి 9.30 గంటలకు, కడపలో రాత్రి 10.30 గంట లకు ప్రయాణికులకు అందుబాటులో ఉంటుందని వివరించారు. అరుణాచలానికి తీసుకు పోయి, తిరిగి తీసుకు వచ్చేందుకు నడిపే అలా డీలక్స్ బస్సుకు పోరుమామిళ్ల నుంచి ఒక్కొక్క రికి రూ.1,314, మైదుకూరు నుంచి రూ.1,162, కడప నుంచి 1,012 టికెట్ ధర చెల్లించాలని తెలిపారు. రిజర్వేషన్ సౌకర్యాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ప్రజాకవి యోగి వేమన విగ్రహం మార్పు సహేతుకం కాదు
### యూనివర్సిటీ అధికారులా- వైసీపీ కార్యకర్తలా ! : సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర

**విశాలాంధ్ర-కడప రూరల్ :** ప్రజాకవి యోగి వేమన విగ్రహం మార్పు సహేతుకం కాదు అని యూనివర్సిటీ అధికారులు వైసీపీ కార్యకర్తల్లా వ్యవహరిస్తున్నారని సిపిఐ జిల్లా కార్యదర్శి ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాకవి యోగివేమన పేరు మీద ఏర్పాటైన విశ్వవిద్యాలయంలో ఆయన విగ్రహాన్నే తీసి పక్కన పెట్టి ఆ స్థానంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం ఏర్పాటు చేయడం సమంజసం కాదన్నారు. వైఎస్ సీఎంగా ఉన్నప్పుడు 2006లో వేమన పేరుతో వైయస్ఆర్ జిల్లా కడపలో ఈ విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేశారు. ఎన్నో ఆటవెలది పద్యాల తో.. సమాజంలో నైతిక విలువలు, మూఢ నమ్మకాలు, కుల వివక్ష వంటివాటిపై జనంలో చైతన్యం తీసుకొచ్చిన ప్రజాకవి వేమన అని ఆయన గొప్పతనాన్ని చాటేలా అప్పట్లో ప్రధాన పరి పాలన భవనం ముందు వేమన విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఇప్పుడు విశ్వవిద్యాలయ అధికారులు అత్యు త్సాహంతో ఆ విగ్రహాన్ని తొలగించి గేటు పక్కన పెట్టి ఆ స్థానంలో వైఎస్ విగ్రహం ఏర్పాటు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తూ యూనివర్సిటీ అధికారులు వైసీపీ కార్యకర్తల వ్యవహరిస్తున్నారని దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని వారు హెచ్చరించారు.

### వేమన విగ్రహాన్ని వెలివేయటం దుర్మార్గం : ఏఐఎస్ఎఫ్

**విశాలాంధ్ర-కడప రూరల్ :** యోగి వేమన విశ్వవిద్యాలయం ప్రధాన గేటు ముందు కూడలి ఏర్పాటు చేసి ఆ కూడలి మధ్యలో 20అడుగుల వేమన కాంస్య విగ్రహంను ఏర్పాటు చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వి. గంగాసురేష్ , ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జి.వలరాజు, ఆర్‌వీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఎమ్.జగదీష్‌లు కోరారు. ప్రధాన గేటు ముందు నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ వైవీయూలో ఉన్న వేమన విగ్రహాన్ని వెలివేసి ఆ స్థానంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం ఏర్పాటు చేశారని తూతూ మంత్రంగా కొత్తగా నిర్మించిన ప్రధాన గేటు ముందు వేమన విగ్రహం అతి చిన్న విగ్రహం ఏర్పాటు చేయటం సమంజసం కాదన్నారు. దీనిని వైవీయూ విద్యార్థులుగా జీర్ణించుకోలేక పోతున్నామన్నారు. ప్రధాన గేటు ముందు కూడలి ఏర్పాటు చేసి ఆ కూడలి మధ్యలో పది అడుగుల దిమ్మె ఆ దిమ్మెపై 20 అడుగుల వేమనకాంస్య విగ్రహాన్ని ఇంకా పెద్ద విగ్రహాన్ని ఏర్పాటుచేసినా సంతోషిస్తామన్నారు. లేని పక్షంలో ఆందోళన చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు శివశంకర్, కటారిశివ, ఏఐవైఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు శివ నాగేంద్ర, అమోస్, శివ తదితరులు పాల్గొన్నారు.

### వేమన విగ్రహాన్ని తొలగించడం సిగ్గుచేటు

**విశాలాంధ్ర - చెన్నూరు :** యోగివేమన యూనివర్సిటీలో గల వేమన విగ్రహం తొలగించడం సిగ్గుచేటని మండల ఐటిడి పి చాంపియన్ యామల మణికంఠ అన్నా రు. గురువారం ఆయన చెన్నూరులో విలే కరులతో మాట్లాడుతూ ప్రజాకవి యోగి వేమన విగ్రహాన్ని యోగి వేమన యూని వర్సిటీ నందు వైయస్సార్సీపి ప్రభుత్వం తొలగించడం ఎంతవరకు ఎంతవరకు సబబని ఆయన ప్రభుత్వా న్ని ప్రశ్నించారు. ఎందరో గొప్ప గొప్ప మహనీయులను మనం స్మరించుకోవడం పోనిచ్చి అలాంటిది ఉన్న విగ్రహాలను తొలగిం చడం, మన కవులకు, మన గొప్ప గొప్ప నాయకులకు మనం ఇచ్చే గౌరవం ఇదేనా అంటూ ఆయన మండిపడ్డారు. ఇలాంటి నీచమైనటువంటి పనులు చేస్తూ తలదిం చుకునేలా వైయస్సార్సీపి ప్రభుత్వం పాలన సాగిస్తుందని ఆయన దుయ్యబట్టారు.

### 12న జాతీయ లోక్ అదాలత్

**విశాలాంధ్ర- మైదుకూరు :** మైదుకూరులోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఈ నెల 12న (శనివారం) జాతీయ లోక్ అదాలతు నిర్వహిస్తున్నారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్ర సేవాధికార సంస్థ సూచనతో మండల న్యాయ సేవాధికార సంస్థ నిర్వహించనున్న ఈ లోక్ అదాలత్ లో ఉదయం 10 నుంచి సాయం త్రం 5 గంటల వరకు ఇరువర్గాల వారి అంగీ కార యోగ్యంతో కేసులను పరిష్కరించను న్నారు. ఈ సందర్భంగా బుధవారం జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి షేక్ ఖాజా మొయినుద్దీన్ మాట్లాడుతూ ఈ నెల ఎ 12న జరిగే జాతీయ లోక్ అదాలతన్ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాజీ మార్గం తో కేసులను పరిష్కరించుకోవడం వల్ల సమయం వృథా కాకుండా ఉంటుందన్నారు. రాజీ కావడం వల్ల కేసులో ఏ ఒక్కరూ ఓడిపోరని, ఇద్దరూ గెలిచినట్టేనన్నారు.

## ఖాతాదారులకు ఏపీజీబీ మెరుగైన సేవలు
### డీఐజీఐ యాప్ డౌన్‌లోడ్‌పై అవగాహన- సేవలు సద్వినియోగం చేసుకోండి : బీఎం కల్యాణ్ కుమార్

**విశాలాంధ్ర-యర్రగుంట్ల :** ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ద్వారా ఖాతాదారు లకు మెరుగైన సేవలు అందించడం జరుగుతోందని అందులో భాగంగా తక్కువ వడ్డీకే రుణ సదుపాయం ఫిక్సుడు డిపాజిట్లపై అధిక వడ్డీ చెల్లించే సదుపాయం కల్పించామని ఎర్రగుంట్ల ఏపీజీబీ బ్రాంచి మేనేజర్ కల్యాణ్‌కుమార్ స్పష్టం చేశారు. బ్యాంకు సేవలపై గురు వారం స్థానిక ప్రభుత్వ పాఠశాల ఆవరణం లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కల్యాణ్ కుమార్ మాట్లా డుతూ ఫిక్సుడు డిపాజిట్లపై అన్ని బ్యాంకుల కన్నా తమ బ్యాంకు ద్వారా అధికవడ్డీ పొందవచ్చునన్నారు. వాస్తవాలపై అవగాహన పెంచుకొని ఏపీజీబీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డిజిటల్ లావాదేవీలలో భాగంగా ఏటీఎం, రూపే కార్డులు, మిస్డ్‌కాల్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్, ఇంటర్నెట్ బ్యాంకు సదుపాయాలు కల్పించడం జరిగిందన్నారు. ఖాతాదారులు ప్రతి ఒక్కరు ఈ సేవలను వినియోగించాలని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా ఏపీజీబీ డీఐజీఐ ఖాతా యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని ఆన్‌లైన్ ఖాతాలు ప్రారంభించుకోవడంపై కల్యాణ్‌కుమార్ వివరించగా మాధవరావు మ్యాజిక్‌షో ద్వారా పొదుపు మీద అధిక వడ్డీ, రుణాల మీద తక్కువ వడ్డీ, డిజిటల్ లావాదేవీలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఖాతాదారులతో పాటు బ్యాంకు ఫీల్డు ఆఫీసర్ రాజశేఖర్ కూడా పాల్గొన్నారు.

విశాలాంధ్ర
అన్నమయ్య జిల్లా



## శశిఆర్థో, మల్టిస్పెషలిటీ హస్పిటల్ ప్రారంభించిన మంత్రి పెద్దిరెడ్డి

**విశాలాంధ్ర-పీలేరు:** స్థానిక తిరుపతిలో రోడ్డులో నూతనంగా నిర్మించినశశి ఆర్థో, మల్టి స్పెషలిటీ హస్పిటల్ ను రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పీలేరు శాసనసభ్యులు చింతల రామచంద్రారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పట్టణం లో అత్యాధునిక పరికరాలతో ప్రజలకు అనుకూలంగా మల్టిస్పెషలిటీహస్పిటల్‌ను ప్రముఖ వైద్యులు నరాల ఎముకల స్పెషలిటీ ప్రముఖ వైద్యులు శశభూషణ్ రెడ్డి ఈ శశిఆర్థోమరియుమల్టిస్పెషలిటీహస్పిటల్ ఏర్పాటు చేయడం సంతోషమని తెలిపారు. పీలేరు పంచాయతీ నందు యం ఎన్ ఆర్ .గార్డెన్స్ రెసిడెన్సీ ప్రారంభోస్తావ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కంభం సతీష్ రెడ్డి, పీలేరు వైసీపీ యువ నాయకులు, యంగ్ స్టార్ పీలేరు సర్పంచ్ హబీబ్ బాషా, జడ్పీటీసీ రత్నశేఖర్ రెడ్డి, పీలేరు మార్కెట్ చేర్మెన్ కడప గిరి, టెలికామ్ సభ్యులు షఫీ,చక్రధర్, పెద్దిరెడ్డి ద్వారకనాథ రెడ్డి,ఉదయ్ కుమార్, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

## 14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

**విశాలాంధ్ర - రైల్వేకోడూరు :** జిల్లా గ్రంథాలయ చైర్మన్ లింగాల ఉషారాణి, సెక్రటరీ సయ్యద్ అమీరుద్దీన్, జిల్లా గ్రంథాలయ అధికారి తుపాకుల సురేష్ ఆధ్వర్యంలో 14 నవంబర్ 2022న సోమవారం నుండి 55వ గ్రంథాలయ వారోత్సవాలు జరుగుతాయని వైకోట లైబ్రేరియన్ మధు, పెనగలూరు లైబ్రేరియన్ సుధాకర్, కోడూరు లైబ్రేరియన్ మందల శ్రీనివాసులు గురువారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. 14వ తేదీ నుండి 20 తేది వరకు ఏడు రోజులు పాటు వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రధానం చేస్తామన్నారు.

## అంగన్వాడి భవన నిర్మాణానికి భూమి పూజ

**విశాలాంధ్ర-రామాపురం :** మండలంలోని కసిరెడ్డిగారి పల్లి కొత్తరోడ్డు నారాయణపురం అంగన్వాడీ నూతన భవననిర్మాణని గురువారం మార్కెట్ కమిటీ చైర్మన్ కర్ణపు విశ్వనాథ్ రెడ్డి. వైఎస్ఆర్సిపి మండల కన్వీనర్ మాజీ ఎంపీపీ గడికోట జనార్దన్ రెడ్డి. జడ్పీటీసీ మాసాన వెంకట రమణ.లు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడి భవన నిర్మాణానికి 15 లక్షల రూపాయలతో భూమి పూజ చేశామన్నారు. అంగన్వాడి భవనానికి రూ 13.50 లక్షలు,ఆట వస్తువులకు 2.50 లక్షల రూపాయలు చొప్పున నిధులు మంజూరు అయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో రఘు రేకం నారాయణ, వైస్ సర్పంచ్ మామిళ్ళ శివ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బండారు తిమ్మారెడ్డి, ఎనుగుల సుధాకర్, సచివాలయ సిబ్బంది అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

## భక్తులకు అన్నదానం

**విశాలాంధ్ర-వీరబల్లి :** స్థానిక సాయిబాబా ఆలయంలో గురువారం కార్తీక మాసాలు శుభ సందర్భంగా ఆలయంలో ఉదయం నుండి స్వామివారికి ప్రత్యేక అలంకరణతో వేద పండితులచే పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అదేవిధంగా ఆలయంలో ప్రతి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాలు కూడా జరుగుతాయని ఆలయ ధర్మకర్తలు తెలిపారు. కావున ప్రతి ఒక్కరూ సాయిబాబా ఆలయంలో జరిగే ప్రత్యేక పూజలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రామ కృష్ణ రాజు విఆర్డిఎస్ స్వచ్ఛంద సంస్థ చైర్మన్ సురేంద్ర రెడ్డి శ్రీధర్ రెడ్డి భక్తదులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఆర్టీసీ బస్సు సదుపాయం

**విశాలాంధ్ర - రామసముద్రం :** మండలంలోని దాసర్లపల్లి, పైగడ్డ,ఎలవా నెల్లూరు,కొత్తూరు, అనప్పల్లె గ్రామాలలోని విద్యార్థులకు ఏపీఎస్ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు పుంగనూరు డిపో మేనేజర్ సుధాకర్ తెలిపారు.ఆయన మండల వైకాపా కన్వీనర్ భాస్కర్ గౌడ్ తో కలిసి గురువారం మాట్లాడుతూ రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి ఆదేశాల మేరకు విద్యార్థులు సౌకర్యం కోసం ఆర్టీసీ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఉదయ శంకర్ రెడ్డి,ఎంపీటీసీ పద్మ,వైకాపా నాయకుడు ఈశ్వర్ ఆర్టీసీ ఏర్పాటుపై ఎంపీ మిథున్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.విద్యార్థులు ఇబ్బందులు పడకుండా ఆర్టీసీ ఏర్పాటు చేయడం సంతోషించదగ్గ విషయమని వెల్లడించారు.

## ఏవోగా బాధ్యతలు స్వీకరించిన రత్నమ్మ

**విశాలాంధ్ర - గుర్రంకొండ :** మండల నూతన వ్యవ సాయ అధికారిణిగా రత్నమ్మ గురువారం బాధ్యతలు స్వీకరించారు.ఇక్కడ పనిచేస్తున్న ఇన్ ఛార్జి ఏవో బదిలీపై వెళ్లడంతో ఆమె స్థానంలో రత్నమ్మ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సచివాలయాల్లో వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు ఎల్లవేళలా గ్రామాలలో అందుబాటులో ఉంటానని, పంటలపరంగా, వ్యవసాయం పరంగా సమస్యలు ఉంటే వారి దృష్టికి తేవాలన్నారు.అలాగే గుర్రంకొండ పట్టణంలోని ఎరువుల దుకాణాలలో నాణ్యమైన ఎరువులని తీసుకోవాలని, దానితోపాటు రశీదు కూడా దుకాణదారుల నుంచి రైతులు పొందాలన్నారు.సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు.

## తెలుగు సూర్యుడు సిపి బ్రౌన్ జయంతి

**విశాలాంధ్ర - వాల్మీకిపురం :** వాల్మీకిపురం మండలం గండబోయినపల్లిలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గురువారం తెలుగు సూర్యుడు సిపి బ్రౌన్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా సిపి బ్రౌన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ తెలుగు సాహిత్యాభివృద్ధికి సిపి బ్రౌన్ చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక అధ్యక్షుడు ప్రపోచరణ్, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, ఉపాధ్యాయులు మురళి, శ్రీకాంత్, కిషోర్, సిరాజున్నిసా, శేఖర్ మునిరత్నం తదితరులు పాల్గొన్నారు.

# నాడు-నేడు పనులు గడువులోపు పూర్తి చేయాలి: కలెక్టర్

**విశాలాంధ్ర-రాయచోటిటౌన్:** మనబడి నాడు-నేడు రెండవ విడత పనులను నిర్దేశించిన గడువు లోపల పూర్తి చేయాలని అన్నమయ్య జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ విద్యాశాఖ ప్రత్యేక అధికారులను.గురువారం విజయవాడలోని సమగ్ర శిక్షా కార్యాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా విద్యాశాఖ అధికారులు, ఇంజినీరింగ్ అధికారులతో రెండవ దశ మనబడి "నాడు-నేడు" పనుల పురోగతి పై పాఠశాలల ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్యదర్శి కాటమనేని భాస్కర్ తో కలిసి విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్థానిక కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ గిరీష పిఎస్, డీఈఓ రాఘవరెడ్డి, ఐసిడిఎస్ పిడి నిర్మల, ఆర్డబ్ల్యూఎస్ ఎస్సీ ప్రసన్నకుమార్, డిఐఈఓ కృష్ణయ్య, నాడు నేడు ఇంచార్జ్ కోఆర్డినేటర్ కరుణాకర్, సమగ్ర శిక్ష ఈఈ లు, డివిఈఓ లు తదితరులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ గిరీష పిఎస్ అధికారులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మనబడి నాడు-నేడు పనులు నిర్దేశించిన గడువు లోపు పూర్తి చేయాలన్నారు. ఇసుక సమస్య తలెత్తకుండా అవసరం మేరకు స్టాక్ పాయింట్ల నుండి ఇసుక తెప్పించుకోవాలి. ఎక్కడైనా ఇసుక సమస్య ఉన్నట్లయితే వెంటనే సంబంధిత తహసీల్దార్, ఆర్డీఓలకు తెలియజేసి సమస్య పరిష్కరించుకోవాలన్నారు. అలాగే సిమెంటుకు కూడా ముందస్తు ఇండెంట్లు పంపాలన్నారు. పనుల నిర్వహణలో నాణ్యతా ప్రమాణాలు లోపిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అన్ని పాఠశాలల్లో చేసిన పనులకు సంబంధించిన ఖర్చులను వెంటనే ఆన్లైన్లో నమోదు చేయాలని సూచించారు.

**హౌసింగ్ లేఅవుట్‌లలో మౌలిక వసతులు కల్పించాలి:** జగనన్న హౌసింగ్ లేఔట్ లలో అన్ని మౌలిక వసతులు కల్పించి ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అన్నమయ్య జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ అధికారులకు సూచించారు. గురువారం వెలగపూడి సచివాలయం నుంచి హౌసింగ్, స్పందన,రీసర్వే తదితర అంశాల పై జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీర్‌శర్మ, ఇతర ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

స్థానిక కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి జిల్లా కలెక్టర్ గిరీష పిఎస్, జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారియా, డిఆర్ ఓ సత్యనారాయణ, హౌసింగ్ పిడి శివయ్య, ల్యాండ్ అండ్ సర్వే ఏడి జయరాజు,తదితరులు పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం అధికారులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన గ్రీవెన్స్ సంబంధించి బియాండ్ ఎస్ ఎల్ ఏలోకి పోకుండా నాణ్యతతో గడువులోగా అర్జీలను పరిష్కరించాలన్నారు. జగనన్న హౌసింగ్ లే అవుట్ లలో ఇళ్ల నిర్మాణాలు నిర్లక్ష్యం చేయరాదన్నారు. లబ్ధిదారులకు ఇసుక, సిమెంటు, స్టీలు సకాలంలో ఇవ్వడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఎక్కడైనా ఇసుక సమస్య ఉన్నట్లయితే వెంటనే సంబంధిత ఆర్డిఓ, తహసిల్దార్ కు తెలియజేసి సమస్య పరిష్కరించుకోవాలన్నారు. ప్రస్తుతం వర్షాలు తగ్గుముఖం పట్టాయని ఇకనుంచి కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు ముమ్మరం చేయాలన్నారు. రీసర్వే కు సంబంధించి జిల్లాల అవసరమైన సర్వేయర్లు, సిబ్బంది పుష్కలంగా ఉన్నారని రీ సర్వే పనులు వేగవంత గా పూర్తి చేయాలన్నారు.

## ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి: ఏఐటీయూసీ

**విశాలాంధ్ర - కురబలకోట :** రాష్ట్రంలో పట్టణాలు,నగరాలలో గ్రామీణ ప్రాంతాల్లో ప్రధానమైన రోడ్లమీద గుంతలు ఏర్పడిన కారణంగా ప్రమాదాలు జరిగి,ప్రజల ప్రాణాలు గాలిలో కలిసిపో తున్నాయని,తక్షణమే గుంతలు పడిన రోడ్లను పూడ్చి,ప్రజల ప్రాణాలను కాపాడాలని ఏఐటీయూసీ ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు పి.లోకనాథ డిమాండ్ చేశారు.ఏఐటీయూసీ ఆటో వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సమితి పిలుపు మేరకు గురువారం అంగళ్లు ఆటో స్టాండ్ వద్ద ఆటో డ్రైవర్లు,ఏఐటీయూసీ నాయకులు నిరసన తెలిపారు.ఈ సందర్భంగా లోకనాథ రెడ్డి మాట్లాడుతూ ఆటో కార్మికులపై భారీ జరిమానాలు విధించేలా రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓ నెంబర్ 21ని రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక,ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఆటో కార్మికులు పోరాటం సాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మక్బూల్ బాషా,ఖాదర్ వలీ,సయ్యద్ బాషా,శేఖర్,రాజు,బావాజి, మౌళాలి,గంగాధర్,వజీర్ బాషా,నజీర్ పాల్గొన్నారు.

## రైతులకు పట్టాలు మంజూరు చేయాలి: సీపీఐ

**విశాలాంధ్ర -సుండుపల్లె :** అన్నమయ్య జిల్లా సుండుపల్లె రైతులను తాసిల్దార్ కార్యాలయం చుట్టూ పదేపదే రైతులను తిప్పుకోవడం మంచి సంప్రదాయం కాదనిరైతులకు పట్టాలు మంజూరు చేయాలని సీపీఐ ఆధ్వర్యంలో తిమ్మసముద్రం గ్రామపంచాయతీ బడిసిల్ల వంక రైతులతో కలిసి సుండుపల్లి డిప్యూటీ తాసిల్దార్ సురేందర్ రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బుక్కె విశ్వనాథ నాయక్ మాట్లాడుతూ 75 సంవత్సరాల సుదీర్ఘ భారతావనిలో దశాబ్దాల కాలంగా తాతల ముత్తాతల కాలం నుండి సాగు చేసుకుంటున్న భూములకు ఇప్పటివరకు రైతులకు పట్టాలు లేవంటే నాటి ప్రభుత్వాలు ప్రజలకు రైతులకు ఏమి మేలు చేశాయో కంటికి కనబడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం అసైన్మెంట్ కమిటీ ద్వారా రైతులకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా అధికారులు రైతులను తిప్పుకోకుండా న్యాయం చేయాలని అలా కానిపక్షంలో పార్టీ ఆధ్వర్యంలో ప్రజా పోరాటం చేయక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తిమ్మసముద్రం, బడిసి లంక రైతులు పాల్గొన్నారు.

## అలరించిన నవ్య నృత్యం

**విశాలాంధ్ర - రైల్వేకోడూరు :** తిరుపతి లోని శ్రీకృష్ణ నటరాజ ఆలయం వారు అద్భుతమైన అత్యాధు నిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన మహతి ఆడిటోరియం నందు నవంబర్ 9, 10 తేదీలలో నృత్య బాలోత్సవం నిర్వహించారు. డాల్ఫిన్ డేల్ హైస్కూల్ విద్యార్థిని ఎం.నవ్య నృత్యంలో పాల్గొని భక్తులను కట్టిపడేసింది. నృత్యంలో ప్రతిభను వ్యూహాత్మకంగా ప్రదర్శించి మోమెంటో, మెడల్ ప్రశంస పత్రం సాధించింది. ఈ సందర్భంగా డాల్ఫిన్ డేల్ హైస్కూల్ కరస్పాండెంట్ పంజం సుకుమార్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు బాలా కుమార్, ఉపాధ్యాయ సిబ్బంది నవ్యను సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా సుకుమార్ రెడ్డి మాట్లాడుతూ నృత్యంలో పోటీలు పెరిగితే పిల్లల్లో ఉత్సాహం సమర్థతలు పెరుగుతాయన్నారు. కళలు అభివృద్ధి చెందిన నాడే సమాజంలో శాంతి సుఖాలు వర్ధిల్లుతాయన్నారు. నృత్యాలలో కూడ పోటీలు పెరగాలన్నారు. చదువుతోపాటు కళలలో కూడా రాణించాలన్నారు. కళలలో కూడ ప్రతిభ సాధించడం డాల్ఫిన్ డేల్ హైస్కూల్ కే సాధ్యం అని నవ్య నిరూపించింది.

## విద్య తోనే సమాజాభివృద్ధి :ఎంఈఓ



**విశాలాంధ్ర -రాజంపేట:** విద్యతోనే సమాజాభివృద్ధి చెందు తుందని మండల విద్యాశాఖ అధికారి రఘునాథరాజు అన్నారు. గురువారం రాజంపేటలోని డి.బి.యస్ పల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులకు విజన్స్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు పోతుగుంట రమేష్ నాయుడు ఆధ్వర్యంలో విద్యాసామగ్రిని విద్యార్థులకు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల విద్యాశాఖ అధికారి రఘునాథరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య తోనే సమాజాభివృద్ధి చెందుతుందని వారన్నారు.విజన్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు పోతుగుంట రమేష్ నాయుడు సేవా దృక్పథంతో ఎన్నో మంచి కార్యక్రమాలు చేస్తూ పేద విద్యార్థులను ఆదుకోవడం జరుగుతుందన్నారు. అనంతరం విజన్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు పోతు గుంట రమేష్ నాయుడు మాట్లాడుతూ అట్టడుగునున్న పేదలకు, విద్యార్థులకు సహాయం చేయడంలో మా సంస్థ ఎప్పుడు ముందుంటుందన్నా రు. అలాగే ప్రతి సంవత్సరం కూడా వివిధ పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులకు ఈ విద్యా సామాగ్రిని పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. దీనికి సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి. వెంకటసుబ్బయ్య, చంద్రారెడ్డి, రాజు, స్వర్ణలత, సుబ్రహ్మణ్యం రెడ్డి, గీత విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## సంతాన నేల మల్లేశ్వరస్వామి నూతన ఆలయ కమిటీ ఎన్నిక

**విశాలాంధ్ర - మదనపల్లె రూరల్ :** మదనపల్లి మండలం, సిటియం గ్రామం నందు వెలసిన సంతాన నేల మల్లేశ్వరస్వామి నూతన ఆలయ కమిటిని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.ఈ నూతన కమిటీకి గౌరవ అధ్యక్షులు బీదం మల్లయ్య,అధ్యక్షులు కె.మల్ రెడ్డి, ఉపాధ్యక్షులు కె.భాస్కర్ రెడ్డి,కార్యదర్శి జంగిటి బి.శివయ్య,కార్యదర్శి మల్లికార్జున, కోశాధికారి నంద కుమార్,జాయింట్ సెక్రటరీ సుధాకర్,సలహాదారులుగా బి.గురునాథ్,బీదం రెడ్డప్పరెడ్డి, బి.రాజన్న,మల్లయ్యలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షులు మల్లయ్య,సలహాదారులు బి.గురునాథ్ మాట్లాడుతూ ఎంతో విశేష చరిత్ర కలిగిన సంతాన నేల మల్లేశ్వర స్వామి ఆలయాన్ని మరింత ముందుకు తీసుకువెళ్లడానికి కృషి చేస్తామన్నారు. అలాగే ఉత్సవాల నిర్వహణలోనూ ప్రత్యేకతను చాటి చెబుతామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జి.వి.నాయుడు,స్వామి వారి భక్తులు,ప్రజలు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటర్ల పాత్ర కీలకం

**విశాలాంధ్ర - రైల్వేకోడూరు :** పటిష్టమైన ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటర్ల పాత్ర కీలకమని అర్హత కలిగిన యువత ఓటరుగా నమోదు చేసుకోవాలని తాసిల్దారు బి. రామ మోహన్ పేర్కొన్నారు. గురువారం పాత్రికేయులతో మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఎన్నికల కమిషన్ నవంబర్ నెలలో ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురించడం జరుగుతుందన్నారు. 18 సంవత్సరాలు నిండిన వారందరూ ఓటు నమోదు చేసుకోవాలన్నారు. యువత ఓటర్ గా నమోదు కావడమే కాకుండా తమ కుటుంబ సభ్యులను, స్నేహితులను ఓటర్లుగా నమోదు చేయించి సహకరించాలన్నారు. 5 జనవరి 2023న తుది ఓటర్ల జాబితా ప్రకటించడం జరుగుతుందని ఇలాగా డ్రాఫ్ట్ పబ్లికేషన్ లో ఓటర్ల జాబితాను పరిశీలించుకోవాలని కోరారు. బూత్ లెవెల్ అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎన్నికల సమయంలో మాత్రమే ఓటు గురించి కాకుండా ముందుగానే జాగ్రత్త పడాలన్నారు. పేర్లలో తప్పులుంటే సరిచేసుకునే అవకాశం కలదన్నారు.

## వాల్మీకులను అన్ని ప్రాంతాల్లో ఒకేవిధంగా పరిగణించాలి

**విశాలాంధ్ర - బి.కొత్తకోట :** వాల్మీకులను రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలలో ఒకే విధంగా పరిగణించాలనీ కోరుతూ అన్నమయ్య జిల్లా, బి.కొత్తకోట ఉప తాహశీల్దార్ హరినాథ్‌కు గురువారం తంబళ్లపల్లి విఆర్ఎస్ఎస్ అధ్యక్షుడు చావిడి కిట్టన్న ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు.అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఒకే కులాన్ని వివిధ ప్రాంతాలలో అనేక వర్గాలకు విభజించి పాలిస్తున్నారని,ఇది సరికాదని ఆరోపించారు. వాల్మీకులను అన్ని ప్రాంతాల్లో ఒకేవిధంగా పరిగణించాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.అప్పుడే రాష్ట్రంలో వాల్మీకులు ఒకే కులంగా ఉంటారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం ఉపాధ్యక్షులు రెడ్డప్ప,ఆది,రమణ,నాగ సూరి తదితరులు పాల్గొన్నారు.

## మోటార్లకు మీటర్ల ఏర్పాటును నిలిపివేయాలి: సీపీఐ



**విశాలాంధ్ర-చిట్వేలి :** వ్యవసాయ మోటర్లకి స్మార్ట్ మీటర్లు బిగించే ప్రక్రియని వెంటనే నిలిపవేయాలని మలిశెట్టి జతిన్ ప్రభుత్వాన్ని కోరారు. నిత్యావసర వస్తువుల ధరలు పెట్రోల్ డీజిల్ వంటగ్యాస్ ధరలు సామాన్య ప్రజలకు అందుబాటులోకి తీసుకొని రావాలి అని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు జతిన్ అన్నారు. ఒక కుటుంబం లో పిల్లలు పెద్దలు ఉంటే రోజుకి ఒక లీటర్ పాలు అవసరమవుతుంది ఒక లీటరు పాలు ధర 70 రూపాయలు అవుతుందని ఒక నెలకు కేవలం పాలకే రూ.2000 ఖర్చు చేయాల్సి ఉంటే మిగిలిన నిత్యవసర సరుకు లు ధరలు కొనడం సామాన్య ప్రజలకు తలకు మించిన భారమవు తుందని మలిశెట్టి జతిన్ అన్నారు. అదే కాకుండా రెండు సంవత్సరాలు ముం దర 400 రూపాయలు ఉండే గ్యాస్ సిలిండర్ ఇప్పుడు 1200 అయిందని దీనివల్ల సామాన్య ప్రజలు మనదేశంలో చాలా ఇబ్బంది పడుతున్నారన్నారు.

## మూడు వాలంటీర్ల పోస్టులు భర్తీ

**విశాలాంధ్ర-చిట్వేలి :** మండలములో 3 వాలంటరీ పోస్టుల భర్తీ చేస్తున్నట్టు ఎంపిడిఓ మోహన్ నోటిఫికేషన్ విడుదల చేశారు. 2022నాటికి 18సంవత్సరాలు నిండి 35సంవత్సరాలు లోపు వయస్సు ఉన్నవారు అర్హులన్నారు పట్టణ ప్రాంతాల్లో డిగ్రీ గ్రామాలలో ఇంటర్ విద్యార్హత ఉండాలని ఈ నెల11నుండి 19వ తేదీ వరకు దరఖాస్తు లు స్వీకరణ 12నుండి 20వరకు దరఖాస్తుల పరిశీలన 21నుండి 22వరకు ఇంటర్వ్యూస్ 24వ తేదీన ట్రైనింగ్ మరియు నియామక పత్రాలు నవంబర్ 24వతేదిన ఎంపికైన అభ్యర్థులు విధులలో చెరవలసి ఉంటుందని ఆయన తెలియజేశారు.

## జనసేనపార్టీ పాదయాత్రకు విశేష స్పందన

**విశాలాంధ్ర - రైల్వేకోడూరు :** నియోజకవర్గ అసెంబ్లీ కేంద్రం కోడూ రు నుండి చిట్వేల్ వరకు ప్రధాన రహదారిలో గుంతలు పూడ్చి రోడ్డును విస్తరించి ప్రజల ప్రాణాలను కాపాడాలంటూ గురువారం ఉదయం జన సైనికులు చేపట్టిన పాదయాత్రకు అడుగడుగున ప్రజల నుండి విశేష స్పందన లభించింది. ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి పాదయాత్రకు బ్రహ్మరథం పట్టారు. పాదయాత్రను ఉద్దేశించి జన సేనపార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర మాట్లాడుతూ కోడూరు చిట్వేల్ రోడ్డులో ఏర్పడిన గుంతల వలన అమాయక ప్రజల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు ప్రాణాలు పోతున్న ప్రభుత్వంలో కదలిక రాకపోవడం శోచనీయమ న్నారు. అనేక దఫాలుగా ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయిన ప్రయోజ నం లేకుండా పోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కోడూరు చిట్వేలి ప్రధాన రహదారిని లో గుంత లు పూడ్చి రోడ్డు విస్తరించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతా మని హెచ్చరించారు. పసుపులేటి హరిప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని జనసేన జెండా ఊపి పాదయాత్రను ప్రారంభించారు. జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు గంధంశెట్టి దినకర బాబు, జోగినేని మణి, ఎద్దుల అనంతరాయలు, ముత్యాల కిషోర్ కుమార్, పగడాల వెంకటేష్, చంద్రశేఖర్, దాసరి వీరేంద్ర, పసుపులేటి సాగర్, ఉత్తరాది శివకుమార్, నగిరిపాటి మహేష్, అమర్ నాథ్, వీరమహిళలు పాదయాత్రలో పాల్గొన్నారు.

## ఏకసభ్య కమిషన్ విఆర్ఎస్ఎస్ సేవలను వినియోగించుకోవాలి

**విశాలాంధ్ర - మదనపల్లె :** వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చడానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన శ్యామూల్ ఆనంద్ కుమార్ ఏక సభ్య కమిషన్ స్వాగతిస్తున్నామని, కమిషన్ గ్రామాలలో పర్యటించే సమయంలో విఆర్ఎస్ఎస్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని విఆర్ఎస్ఎస్ మదనపల్లె మండల అధ్యక్షులు సద్దల జయసింహ, పట్టణ అధ్యక్షులు కొత్తఉడుం శంకర్ కోరారు.కమిషన్ గ్రామాలలో పర్యటించే సమయంలో విఆర్ఎస్ఎస్ సేవలను వినియోగించు కోవాలని కోరుతూ గురువారం డిప్యూటీ తహసీల్దారుకు వినతిపత్రం అందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్యామూల్ ఆనంద్ కుమార్ కమిషన్ గ్రామాలలో పర్యటించే సమయంలో వాల్మీకి బోయల స్థితిగతులు తెలిసిన విఆర్ ఎస్ ఎస్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.గ్రామాలలో పర్యటించే సమయంలో విఆర్ఎస్ఎస్ ను సంప్రదిస్తే వారు అన్ని విషయాలను తెలియజేస్తారని,తమ సేవలను వినియోగించుకోవాలని కోరారు.

## వాల్మీకిపురంలో టిప్పు సుల్తాన్ జయంతి

**విశాలాంధ్ర - వాల్మీకిపురం :** మైసూరు సామ్రాజ్య పాలకుడు, స్వాతంత్ర్య సమరయోధుడు టిప్పు సుల్తాన్ 273 వ జయం తిని గురువారం వాల్మీకిపురంలో నిర్వహించారు. టిప్పు సుల్తాన్ యువజన సంఘం, ముస్లిం పెద్దల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 'బాస్' వ్యవస్థాపక అధ్యక్షుడు పిటిఎం శివప్రసాద్ మాట్లాడుతూ ఆంగ్లేయులకు వ్యతిరేకంగా పోరాడిన టిప్పు సుల్తాన్ పోరాటపటిమ యువతకు స్ఫూర్తిదాయకం కావాలన్నారు. అంతకుముందు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అలాగే స్థానిక జామియా మసీదు వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో జామియా మసీదు ముతవల్లి అబ్దుల్ అజీమ్, మత పెద్దలు అమీర్ హుస్సేన్, జవాద్ హుస్సేన్, సయ్యద్ కరీం సాహెబ్, టిప్పు సుల్తాన్ యువజన సంఘ అధ్యక్షుడు రియాజ్, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ నరేష్ కుమార్ ఘనసన్మానం

**విశాలాంధ్ర - సుండుపల్లి :** రాయవరంలో విధులు నిర్వహిస్తున్నారు. ఉన్నత చదువుల కోసం పీజీ చేసేందుకు వెళుతున్నందున డాక్టర్ నరేష్ కుమార్‌కు ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. రాయవరం ప్రభుత్వ ఆసుపత్రి పరిధిలో గత కొన్ని సంవత్సరాలుగా వైద్య సేవలు అందించిన డాక్టర్ నరేష్ కుమార్ ఉన్నత చదువులకు ఎంపిక కావడంతో ఆయన రిలీవయ్యారు. ఆయనకు ఆస్పత్రి సిబ్బంది గురు వారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలకు చేసిన సేవల గురించి పలువురు కొనియాడారు అనంతరం శాలువలు పూలమాలలతో ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శేఖరరెడ్డి సూపర్ వైజర్ వెంకటేశ్వర్ రెడ్డి, ఫార్మసిస్టు నరేష్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆయుష్మాన్ భారత్ సర్వే వేగవంతం చేయండి

**విశాలాంధ్ర- గాలివీడు :** ఆయుష్మాన్ భారత్ ( పీఎంజెఏవై) సర్వే త్వరితగతిన వాలంటీర్ల ద్వారా సచివాలయ సిబ్బంది,ఆరోగ్య శాఖ సిబ్బంది సమన్వయంతో కలిసి పూర్తి చేయాలని ఎంపిడిఓ శేఖర్ నాయక్ పేర్కొన్నారు. గురువారం ఎంపిడిఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎంలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నేటి నుండి మొబైల్ అప్లికేషన్ ద్వారా ప్రతీ సచివాలయం లో పూర్తి చేయవలెను. ఇప్పటి వరకు 50శాతం కూడా సర్వే పూర్తి అవ్వ లేదని అన్నారు. కావున అందరు వాలంటీర్లు ద్వారా వెంటనే సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. మండలంలోని ప్రతి గ్రామ సచివాలయ పరిధిలో ఉన్న సిబ్బంది, వాలంటీర్లు అందరూ కలిసి సర్వే పూర్తి చేయాలని ఈసందర్భంగా సూచించారు.

## చేనేతల సమస్యల పరిష్కారంలో జాతీయ చేనేత ఐక్యవేదిక నిర్విరామ కృషి

- జాతీయ అధ్యక్షులు అవ్వారు మల్లికార్జున

**విశాలాంధ్ర - మదనపల్లె :** జాతీయ చేనేత ఐక్యవేదిక అన్నమయ్య జిల్లా అధ్యక్షులుగా మదనపల్లి పట్టణం, నీరుగట్టు వారిపల్లెకు చెందిన గుండ్లపల్లి రమేష్ నియమితు లయ్యారు. ఈ మేరకు గురువారం గంగోత్రి ఫంక్షన్ హాల్ నందు ఏర్పాటు చేసిన సమావేశంలో చేనేత ఐక్యవేదిక జాతీయ అధ్యక్షులు అవ్వారు మల్లికార్జున ఆయనకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత పరిశ్రమను నమ్ముకున్న కార్మికులను ఆదుకో వడంలో ప్రస్తుత ప్రజాప్రతినిధులు విఫలమయ్యారని,చేనేతల హక్కుల సాధనకు ప్రత్యామ్నా యంగా రాజకీ య పార్టీ అవసరమని, ప్రస్తుతం ఉన్న ఎంపిలు, ఎమ్మెల్యేలు చేనేత సమస్యలపై స్పందించడం లేదని,అసెంబ్లీ, పార్లమెంటు సమావేశాలలో చేనేతలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావిం చడం లేదని విమర్శించారు. చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి చేనేత ఐక్యవేదిక అలుపెరుగని కృషి చేస్తోందన్నారు.సొసైటీ ద్వారా చేనేత కార్మికులకు 40 సాధారణ మగ్గాలు,100 జాకాళ్లు అందజేశా మన్నారు. ప్రతి ఒక్క చేనేత కార్మికుడు గుర్తింపు కార్డును తీసుకోవాలన్నారు. తద్వారా ప్రభుత్వ పథకాల లబ్ధి పొందవచ్చునని, కావున కార్మికులందరూ దరఖాస్తులను పూర్తి చేసి చేనేత ఐక్యవేదిక నాయకులకు ఇస్తే గుర్తింపు కార్డులు మంజూరు చేయిసా_్తమన్నారు. అనంతరం అన్నమయ్య జిల్లా అధ్యక్షులుగా ఎన్నికైన గుండ్లపల్లి రమేష్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఈ పదవి అప్పగించిన జాతీయ అధ్యక్షులు మల్లికార్జునకు, ఇతర నాయకులకు ధన్యవాదాలు తెలుపుకుంటున్నా నన్నారు. చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు.జిల్లాలో చేనేత కార్మికులకు ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువచ్చిన వెంటనే సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుం టానని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో చేనేత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు రుశింగప్ప,వర్కింగ్ ప్రసిడెంట్ మోడెం నాగరాజు,రాయలసీమ ప్రచార కార్యదర్శి వెంకటరమణ, రామచంద్రయ్య, సురేశ్ కుమార్, జయరాం, మడక గంగాధర్, సునకంటి గంగాధర్, వరదరాజులు, బాబు, శ్రీనివాసులు, అధిక సంఖ్యలో చేనేత కార్మికులు పాల్గొన్నారు.

## రెడ్డి కమ్యూనిటీ డెవలప్ మెంట్ సొసైటీ రాయలసీమ మహిళ కన్వీనర్‌గా శారద రెడ్డి

**విశాలాంధ్ర - మదనపల్లె రూరల్ :** సేవా కార్యక్రమాల ద్వారా తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకున్న వైసిపి నాయకురాలు,మదనపల్లె మున్సిపాలిటీ కో-ఆప్షన్ సభ్యురాలుగా వున్న బుసిరెడ్డి శారద రెడ్డి రెడ్డి కమ్యూనిటీ డెవలప్మెంట్ సొసైటీ రాయలసీమ మహిళ కన్వీనర్‌గా నియమితు లయ్యారు. రెడ్డి కమ్యూనిటీ డెవలప్మెంట్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షులు వై.సురేంద్ర రెడ్డి,జనరల్ సెక్రటరీ బి.వెంకటరమణా రెడ్డిలు నియామక ఉత్తర్వులు జారీ చేశారు. సీనియర్ వైసిపి నాయకు రాలుగా గుర్తింపు పొంది,మదనపల్లె మున్సిపాలిటీ కో-ఆప్షన్ సభ్యులుగా నియమించబడిన శారద రెడ్డి ప్రజలకు సేవ చేయడంలో తనదైన గుర్తింపు పొందారు.శారద రెడ్డి సేవలను గుర్తించిన రెడ్డి కమ్యూనిటీ డెవెలెప్మెంటు సొసైటీ వారు రాయలసీమ మహిళ కన్వీనర్‌గా నియమించారు.ఈ సందర్భంగా శారదరెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే నవాజ్ బాషా,ఎంపి మిథున్ రెడ్డి సహకారంతో మదనపల్లె మున్సిపాలిటీలో కో-ఆప్షన్ సభ్యురాలిగా ఎన్నుకోవడం జరిగిందన్నారు.వారు సూచించిన బాటలో నడుస్తూ ప్రజా సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నానని తెలిపారు.కమ్యూనిటీ డెవలప్ మెంటు సొసైటీ వారు రాయలసీమ మహిళ కన్వీనర్‌గా నియమించిన సురేంద్ర రెడ్డి,వెంకటరమణ రెడ్డి, కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు.రెడ్డి సొసైటీలో చురుకుగా పని చేసి రెడ్ల ఐక్యత కోసం పని చేస్తానని స్పష్టం చేశారు.

## బిజెపితోనే బీసీలకు న్యాయం

### ఓబిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

**విశాలాంధ్ర -రాజంపేట:** భారతీయ జనతా పార్టీతో నే బీసీలకు న్యాయం జరుగుతుందని ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిటి ఆంజనేయులు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, రాజంపేట అసెంబ్లీ ఇంచార్జి పోతుగుంట రమేష్ నాయుడులు అన్నారు. గురువారం రాజంపేటలోని బిజెపి కార్యాలయంలో బిజెపి ఓబీసీ మోర్చా జిల్లా కార్యవర్గ సమావేశం ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు రేపన శివప్రసాద్ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిలు గా విచ్చేసిన బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.టి ఆంజనేయులు, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాజంపేట అసెంబ్లీ ఇన్చార్జి పోతుగుంట రమేష్ నాయుడు లు మాట్లాడుతూ ఒక్క బీజేపీతోనే బీసీల సమగ్ర అభివృద్ధి జరుగుతుంద న్నారు. దేశ ప్రధాని సాక్షాత్ బీసీ వర్గానికి చెందిన వ్యక్తని ఆయన క్యాబినెట్లో 26 మంది కేంద్ర మంత్రులు బీసీ వర్గానికి చెందిన వారున్నారన్నారు. దేశంలో బిజెపి 18 రాష్ట్రాల్లో అధికారంలో ఉన్నదని వాటిలో అనేకమంది ముఖ్యమంత్రులు మంత్రులు ఎమ్మెల్యేలు ఎంపీలు జిల్లా పరిషత్ చైర్మన్లు మున్సిపల్ కార్పొరేటర్లు ఇలా రాజకీయ పదవులు అన్నిటిలో బీసీలకు సముచిత స్థానం కల్పిస్తున్న ఏకైక పార్టీ భారతీయ జనతా పార్టీ అని వారు తెలిపారు. దేశంలో మరే ఇతర పార్టీలు బీసీలకు బీజేపి ఇచ్చినంత ప్రాధాన్యత ఇవ్వలేదని తెలిపారు. బీసీలు రాష్ట్రంలో ఆర్థికంగా సామాజికంగా ఎంతో వెనుకబడి ఉన్నారని, వారందరి పరిస్థితులు మారాలంటే ఒక్క బీజేపీతోనే సాధ్యమని, కావున ప్రతి ఒక్క కార్యకర్త భారతీయ జనతా పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసుకుంటూ ప్రజా సమస్యలపై పోరా డాలన్నారు.అనంతరం బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు పట్టుపోగుల ఆది నారాయణ, జిల్లా ఇన్చార్జి గోపాల్ రెడ్డిలు మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీలలో చైతన్యం తీసుకు రావడానికి త్వరలో కోస్తా ఆంధ్ర రాయలసీమలో భారీ బహిరంగ సభలు నిర్వహించడం జరుగుతుందన్నారు. రాబోయే రోజుల్లో ఈ రాష్ట్రంలో అధిక శాతంలో బిజెపి తరఫున ప్రజా ప్రతినిధులుగా పోటీ చేయదానికి అధికారంలోకి రావడానికి అందరూ కృషి చేయాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి రామాంజనేయులు, జిల్లా కోశాధికారి బాలాజీ యాదవ్, బిజెపి పట్టణ ప్రధాన కార్యదర్శి జీకే నాగరాజు, బిజెపి పట్టణ ఉపాధ్యక్షులు తోట నగేష్, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి పి. సూర్యచంద్ర, మాకం రవి జిల్లా నాయకులు మండల అధ్యక్షులు ప్రధాన కార్యదర్శులు ఓబీసీ నాయకులు పాల్గొన్నారు.

## టీబీ పేషెంట్లను దత్తతకు తీసుకోండి

- మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ అంజనేయులు

**విశాలాంధ్ర - మదనపల్లె :** ప్రధానమంత్రి టిబి ముక్త్ భారత్ అభియాన్ పథకం క్రింద టిబి పేషంట్లను దత్తత తీసుకోవాలని గురువారం మెడికల్ సూపరింటెండెంట్ డా.అంజనేయులు తెలిపారు.కేంద్రప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం క్షయ వ్యాధి నివారణకు అనేక కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని,ఇందులో బాగంగా ప్రధానమంత్రి టిబి ముక్త్ భారత్ అభియాన్ పథకంను భారత రాష్ట్రపతి సెప్టెంబర్ 9న నిక్ష్యయ్ మిత్ర అనే యాపును ప్రవేశ పెట్టి అందులో దాతలను నమోదు చేసి నిర్ధారిత క్షయ వ్యాధిగ్రస్థులకు పోష కాహార పదార్థా లు ఇవ్వడం జరుగుతుందని,ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా ఆసుపత్రి మదనపల్లి నందు నిర్ధారిత టిబి రోగులకు వారి సమ్మతితో దాతల సహకారంతో పౌష్టిక ఆహార పదార్థాలను అందచేయడం జరిగింది. దాత విజయభారతి పాఠశాల కరెస్పాండెంట్ డాక్టర్ సేతు మాట్లాడుతు క్షయవ్యాధి నివారణ మనందరి బాధ్యత అని, ప్రజలు, దాతలు,స్వచ్ఛంద సంస్థలు,టిబి పేషంట్లను దత్తత తీసుకొని ఆదుకోవాలని,తన వంతుగా మదనపల్లి పరిధిలో 20 మంది నిర్ధారిత టిబి పేషంట్లను 3 నెలలపాటు దత్తత తీసుకొని పోషక ఆహార పదర్థాలు ఇస్తానని తెలిపారు.ఈ రోజు మదనపల్లి అర్బన్ మరియు రూరల్ ఏరియాల పరిధిలో కల 32 మంది నిర్ధారిత పేషంట్ లకు దాతలు సేతు గారు కరెస్పాన్డెంట్ విజయభారతి స్కూల్ 20 పేషంట్లను,కరుణాకర్, సి.ఎమ్.ఓ ,నాడు -నేడు ప్రోగ్రాం అన్నమయ్య జిల్లా ఇంచార్జి 3 పేషంట్ లను,వీరభద్ర మదనపల్లి 3 పేషెంట్లను,రామకుమార్ ఆచారి 3 పేషంట్లను, ప్రభుత్వ పాఠశాల అన్నపగుట్ట ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు మునిరాజ్, అబ్దుల్ రేహమాన్, హేమలత ఒక్కొక్కరిని 3 నెలల పాటు దత్తత తీసుకొని వారికి పోష కాహార పదార్థాలు అందించారు. ఈ సందర్భంగా దాతలను జిల్లా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్, వైద్యులు అభినందించారు. ఈ కార్యక్రమంలో మదనపల్లి టిబి యూనిట్ సిబ్బంది సిబ్బాల ప్రభాకర్,దయాలన్, వనజకుమారి,సుశీల్,జ్ఞాన తిలగం, పార్థసారథి, జిల్లా ప్రధాన వైద్యాశాల డాక్టర్లు,నర్సింగ్ సుపెర్డినేనెట్, నర్సులు,సెక్యూరిటీ సిబ్బంది సురేష్ పాల్గొన్నారు.

## మంచి విద్యతో పాటు నాణ్యమైన భోజనం అందించాలి

**విశాలాంధ్ర- నందలూరు:** విద్యార్థులకు మంచి విద్యతో పాటు నాణ్యమైన భోజనం అందించాలని ఎంపిపి మెడ విజయ భాస్కర్ రెడ్డి అన్నారు. గురువారం మహాత్మా జ్యోతిబా పూలే కళాశాల ప్రిన్సిపాల్ మౌనిక ఎంపిపి మేడ విజయ భాస్కర్ రెడ్డి ని మండల పరిషత్ కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ పిల్లలకు మంచి భోజనం అందించాలని అన్నారు. మెను ప్రకారం ప్రతిరోజూ ఆహారపదార్థాలను పెట్టాలని సూచించారు. ప్రతి రోజూ మంచివిద్యను అందించి పాటశాల కు మంచి పేరు తీసుకురావాలని పేర్కొన్నారు. ఈనెల 14వ తేదీన జరిగే బాలల దినోత్సవం వేడుకల్లో పాల్గొనాలని కళాశాల ప్రిన్సిపాల్ మౌనిక ఎంపిపి కి ఆహ్వానం పలికారు. ఈ కార్యక్రమంలో నాగిరెడ్డిపల్లి మేజర్ పంచాయతీ సర్పంచ్ జంబు సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామకంతం సర్వేను పక్కాగా పూర్తిచేయాలి

- జగనన్న స్వచ్ఛ సంకల్పం సక్రమంగా అమలు కావాలి
- కలెక్టర్ గిరీషా పీఎస్

**విశాలాంధ్ర-రాయచోటిటౌన్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గ్రామకంతం రీ సర్వేను నిర్దేశించిన లక్ష్యం మేరకు పక్కాగా పూర్తిచేయాలని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది కలెక్టర్లు, జేసీలను ఆదేశించారు. గురువారం వెలగపూడి సచివాలయం నుంచి వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూ హక్కు మరియు భూ రక్ష పథకంలో భాగంగా గ్రామకంతం భూముల సర్వే, జగనన్న స్వచ్ఛ సంకల్పం, ఉపాధి హామీ, ప్రభుత్వ ప్రాధాన్యత భవన నిర్మాణాల పురోగతి తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లు, జేసిలు, పంచాయతీ రాజ్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారులతో రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణా భివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.అన్నమయ్య జిల్లా రాయచోటి లోని కలెక్టరేట్ మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ గిరీష పిఎస్, జేసి తమీమ్ అన్సారీయాలు పాల్గొన్నారు. వీసీ అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లా డుతూ జిల్లాలో వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూ హక్కు భూ రక్ష పథకం లో భాగంగా గ్రామకంతం రీ సర్వేను పక్కాగా నిర్దేశించిన లక్ష్యం మేరకు పూర్తి చేయాలన్నారు. ఇందుకు సంబంధించి గ్రౌండ్ ట్రూతింగ్, గ్రౌండ్ వ్యాలీడేషన్ వచ్చేవారం కల్లా ప్రగతి సాధించాలని సర్వే ఏడీని ఆదేశించారు. 166 గ్రామాలలో డ్రోన్ ఫ్లయింగ్, 56 గ్రామాలలో గ్రౌండ్ ట్రూతింగ్ పూర్తయిందన్నారు. మరొక 37 గ్రామాలలో గ్రౌండ్ ట్రూతింగ్ ప్రోగ్రెస్ లో కలదు అన్నారు. 10 గ్రామాల్లో గ్రౌండ్ వ్యాలీడేషన్ పూర్తి అయిందన్నారు. ఈ ప్రక్రియలను త్వరగా పూర్తి చేయాలన్నారు. ఉపాధి హామీ పథకంలో రోజువారీ కూలీల సంఖ్యను పెంచాలని డ్వామా పీడీని ఆదేశించారు. అత్యంత ప్రాధాన్యత క్రమంలో ప్రభుత్వం నిర్మిస్తున్న శాశ్వత భవన నిర్మాణాలలో స్టేజిల వారీగా ప్రతివారం తప్పనిసరిగా ప్రగతి ఉండాలి. భవన నిర్మాణాలకు సంబంధించి ఇచ్చిన లక్ష్యంను అధిగమిం చాలని పేర్కొన్నారు. ఈ వీసిలో సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడి జయరాజ్, పంచాయతీరాజ్, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈలు సురేష్ కుమార్, ప్రసన్నకుమార్, డిపిఓ నాగరాజు, డ్వామా, డిఆర్డీఏ పిడిలు మద్దిలేటి, రామ్మోహన్ పాల్గొన్నారు.

## మల్టీపర్పస్ ఫెసిలిటీ సెంటర్లు త్వరితగతిన పూర్తి చేయాలి

- జగనన్న పాలవెల్లువ ద్వారా పాల సేకరణ లక్ష్యాన్ని అధిగమించాలి

**విశాలాంధ్ర-రాయచోటిటౌన్:** జిల్లాలలో వీలైనంత త్వరగా మల్టీపర్పస్ ఫెసిలిటీ సెంటర్లను రైతులకు అందుబాటులోకి తీసుకు రావాలని అన్నమయ్య జిల్లా కలెక్టర్ గిరిసా పిఎస్ అధికారులను ఆదేశించారు.గురువారం విజయవాడ నుంచి మల్టీపర్పస్ ఫెసిలిటీ సెంటర్స్ ల్యాండ్ అలాట్మెంట్, ఏఎంసీయూ మరియు బిఎంసియు భవన నిర్మాణాల వేగవంతంపై అన్ని జిల్లాల కలెక్టర్లు, జేసీలతో ,మార్కెటింగ్ శాఖ కమిషనర్ ప్రద్యుమ్న పిఎస్, కో-ఆపరేటివ్ సొసైటీస్ ఎండి అహ్మద్ బాబు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హల్ నుంచి జిల్లా కలెక్టర్ గిరీష పిఎస్, జేసి తమీమ్ అన్సారియా, పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి గుణ శేఖర్ పిల్లై, మార్కెటింగ్ ఏడి త్యాగరాజు, పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ గిరీష పిఎస్ అధికారులతో మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో బహుళార్ధసాధక సౌకర్యాల కేంద్రాలు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పాలసేకరణ లక్ష్యాన్ని అధిగమించేందుకు సంబంధిత అధికారులు కృషి చేయాలన్నారు. బీఎంసీయుల నిర్మాణా లలో నిర్లక్ష్యం చేయకుండా త్వరితగతిన పూర్తి చేయా లన్నారు. ఏఎంసీయులకు భూ సేకరణ చేపట్టి పనుల నిర్మాణాలలో పురోగతి కనిపించాలన్నారు.

## ప్రభుత్వ బీటీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ జి.గిరిబాబు

**విశాలాంధ్ర - మదనపల్లె :** అన్నమయ్య జిల్లా,మదనపల్లి పట్టణంలోని చారిత్రాత్మక ప్రభుత్వ బీటీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గా డాక్టర్.జి. గిరిబాబుని ఉన్నత విద్యా కమిష నర్ నియ మించారు. ఏలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గా ఇదివరకే విధులు నిర్వహిస్తూ ఆన్ డ్యూటీ మీద బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు రావడం జరిగిందని తెలిపారు. ఈ నేపథ్యంలో డాక్టర్.జి.గిరిబాబు గురువారం పదవీబాధ్యతలను స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. జి. గిరిబాబు మాట్లాడుతూ కళాశాల ప్రిన్సిపాల్ గా బాధ్యతలు చేపట్టడం తనకు ఎంతో ఆనందంగా ఉందన్నారు.విద్యార్థులకు అందుబాటులో ఉండి వారి అభివృద్ధికి సహకరిస్తానన్నారు. విద్యార్థుల చదువులపై ప్రత్యేక దృష్టి పెడతానని, కళాశాల అభివృద్ధికి విద్యార్థులు, పూర్వ విద్యార్థులు,పట్టణ ప్రజలు, ప్రజాప్రతినిధులు విలువైన అభిప్రాన్ని తెలియ జేసి కళాశాలను అభివృద్ధి చేయదానికి మళ్లీ కళాశాలకు పూర్వ వైభవం తీసుకురావదానికి సహాయ సహకారాలు అందించాలని కోరారు. విద్యార్థులు చదువుపై ప్రత్యేక దృష్టి వహించా లని,అందుకోసం తన వంతు కృషి చేస్తానని,ఉన్నత స్థాయిలో ఉండడానికి ప్రతి విద్యార్థి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్.ఎం.సుధాకరా రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డి.వెంకట శివా రెడ్డి పాల్గొన్నారు.

## ఉద్యాన కలెక్షన్ సెంటర్ స్థలం పరిశీలన

**విశాలాంధ్ర-పీలేరు:** జిల్లా ఉద్యాన రవిచంద్ర బాబు తలుపుల గ్రామంలో నూతనంగా నిర్మించదలచిన కలెక్షన్ సెంటర్ జాగాను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్తగా ఎవరైనా రైతులు సంఘాలుగా ఏర్పడి ఈ కలెక్షన్ సెంటర్ నిర్మించుకుంటే కనుక ఒక్కొక్క సంఘానికి గరిష్టంగా 75 శాతం సబ్సిడీ వస్తుందని తెలియజేశారు.ఈ కలెక్షన్స్ సెంటర్ యొక్క మొత్తం అంచనా వ్యయం 15 లక్షలు, ఇందులో 11 లక్షల 25 వేల రూపాయలను గవర్నమెంట్ సబ్సిడీ రూపం లో ఇస్తుందని తెలియజేశారు . ఈ కలెక్షన్ సెంటర్ నిర్మించుకొని ఇందులో రైతులు తాము పండించిన మామిడికాయలను గ్రేడింగ్ మరియు ప్యాకింగ్ చేసుకొని జ్యూస్ ఫ్యాక్టరీ గాని లేకపోతే ఇతర ప్రాంతాలకు ఎక్స్పోర్ట్ చేసుకోవచ్చని తెలియజేశారు. ఈ రైతు సంఘాలకు ఉద్యాన శాఖ ద్వారా శీతల గిడ్డంగులను నిర్మించుకునే దానికి కూడా ప్రభుత్వము సబ్సిడీ రూపంలో ఇస్తుందని తెలియజేశారు. ఒక్కొక్క శీతల గడ్డంగి అంచనా వ్యయం మొత్తం రూ.12,50,000 , ఇందులో సంఘాలకు 75శాతం సబ్సిడీ వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీలేరు ఉద్యాన శాఖ అధికారి అలాగే తలుపుల గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## పొగాకు వాడకం ఆరోగ్యానికి హానికరం

**విశాలాంధ్ర-పీలేరు:** ప్రమాదకర రసాయనాలు తో కూడిన పొగాకు వాటి ఉత్పత్తుల వాడకం వల్ల నివారణ లేని అసంక్రమిత వ్యాధులు వచ్చే అవకా శం అధికమని డాక్టర్ చంద్రశేఖర్ నాయక్ అన్నా రు. గురువారం ముదుపుల వేముల గ్రామంలో నిర్వహించిన గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టర్ సేవలు కార్యక్రమంలో భాగంగా పొగాకు ఉత్పత్తులు - క్యాన్సర్ వ్యాధి- అంశంపై ప్రజలకు అవగాన కల్పించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ నాయక్ వివరిస్తూ, పొగాకు వాటి ఉత్పత్తులు వాడకం వల్ల పెదవి, నోటి, నాలుక,గొంతు,స్వరపేటిక, ఊపిరితిత్తులు, మొదలగు క్యాన్సర్లతో పాటు గుండెపోటు, పక్షవాతం, ఊపిరి తిత్తులు, ఏకాగ్రత దెబ్బతినడం, జ్ఞాపకశక్తి, నిర్ణయా లు, కంటి చూపు, పంటి సామర్థ్యం దెబ్బతినడం వంటి ఆరోగ్య సమస్యలు వస్తాయని, శరీరంలో మింగటం, అజీర్ణం, పుండ్లు, బరువు తగ్గడం, గొంతు నొప్పి, జ్వరం, నొప్పి, దగ్గు, స్రావాలు, మొదలగు దీర్ఘకాలిక అసాధారణ లక్షణాలు కనిపిస్తే తక్షణం నివారణ చర్యలకై వైద్యులను సంప్రదించి సమస్యలు నివృత్తి చేసుకోవాలన్నారు. ఎప్పుడైనా, ఎక్కడైనా, ధనిక, బీద, ఆడ, మగ, చిన్న, పెద్ద తేడా లేకుండా క్యాన్సర్ వ్యాధి రావచ్చునని బలమైన శారీరక, మానసిక ఆరోగ్యమే దేశ భవిష్యత్తుకు అవసరం దృష్ట్యా పొగాకు వాటి ఉత్పత్తులను వాడరాదని, జననేంద్రియాలను వ్యక్తిగత శుభ్రతతో పాటు,చేసే ఆలోచన, వ్యాపకాలు, జ్ఞాపకాలు మొదలగు మంచి జీవన శైలి వ్యక్తి శాస్త్రీయంగా కలిగి ఉంటే నివారణే లేని వ్యాధులు మన దరి చేరవని డాక్టర్ చంద్రశేఖర్ నాయక్ ప్రజలకు తెలిపారు. ఈ కార్యక్ర మంలో హెల్త్ ఎడ్యుకేటర్ కొండయ్య, సి.హెచ్.ఓ. ముత్యం ముత్యం, ఏ.యన్. యం. వసుంధర, వెంకటరత్నం, డేటా ఎంట్రీ, నాగసుధ,ఆశా కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

## విశాఖ ఉక్కు ప్రైవేటీ కరణ ఆపండి..

### విభజన హామీ చట్టాలను అమలు పరచాలి

**విశాలాంధ్ర-పీలేరు:** పీలేరు విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను ఆపకపోతే విశాఖ ఉక్కుకార్మికుల ఆగ్రహాన్ని ఎదుర్కోవలసి వస్తుందని కాంగ్రెస్ రాష్ట్ర మైనారిటీ వైస్ చైర్మన్ షేక్ మహబూబ్ బాషా తెలిపారు.ఆయన పిలేరులో ఓ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విభజన జరిగి దాదాపు 8 సంవత్సరాలు పూర్తి అయిన పార్లమెంట్ సాక్షిగా చేసిన చట్టాలను అమలు పరచకుండా ఉద్దేశ పూర్వకంగా రాష్ట్రానికి అన్యాయం చేస్తున్నారని దేశ ప్రధాని నరేంద్ర మోడీ కు కార్మికుల నిరసన సెగ తప్పదని అన్నారు.గత 600 రోజులుగా విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ ను వ్యతిరేకిస్తూ పెద్ద ఎత్తున చేస్తున్న ఉద్యమాల పట్ల ప్రధాని మోడీ స్పందించకపోవడం దురదృష్టకరమని, మోడీ మెడలు వంచుతామని ప్రగల్భాలు పలికిన జగన్ మోహన్ రెడ్డి ఆ విషయం మరిచి ప్రధానమంత్రి కి మోకరిల్లి మోడీ పర్యటనకు రెడ్ కార్పెట్ పరుస్తున్నారని అన్నారు. విశాఖ ఉక్కు రైల్వే జోన్ కోసం మంత్రి పదవులు, ఎంపీ ,ఎమ్మెల్యేల పదవులకు రాజీనామా చేస్తామన్న అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులు నోరు మెదపకుండా, మూడు రాజధానులకు అనుకూలంగా రాజీనామాలు చేస్తామని వైకాపా పార్టీ మంత్రులు ,ఎమ్మెల్యేలు డ్రామాలు ఆడటం సిగ్గుచేటని తీవ్రంగా విమర్శించారు.విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అని నినాదంతో 32 మంది బలిదానాలతో సాధించుకున్న విశాఖకు ప్రైవేటీకరణ జరగకుండా ఆపవలసిన బాధ్యత కేంద్ర ప్రభుత్వాన్ని దేనని , రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం మీద ఒత్తిడి తెచ్చి విశాఖ ఉక్కును కాపాడాలన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ వ్యతిరేకిస్తూ ఉద్యమిస్తున్న వివిధ రాజకీయ, ప్రజా సంఘాల నాయకులను, ఉద్యోగ సంఘాల నాయకులను పోలీసు లతో బలవంతంగాఅరెస్టు చేయించడం దుర్మార్గమైన చర్యని ఆయన తీవ్రంగా విమర్శించారు.జగన్ ప్రతిపక్షంలో ఉండగా తనకు 25 ఎంపీ సీట్లు ఇస్తే ప్రధాని మోడీ మెడలు వంచి ఏపీకి ప్రత్యేక హెూదా సాధిస్తానని ప్రగల్భాలు పలికి, ఇప్పుడు కిక్కురు మన కొండ ఉండడంలో ఆంతర్యం ఏమిటనేది చెప్పాలని మహబూబ్ బాషా ప్రశ్నించారు.

## సర్వసభ సమావేశానికి గైర్హాజరైన అధికారులపై కలెక్టరుకు ఫిర్యాదు

**విశాలాంధ్ర - మదనపల్లి రూరల్ :** మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రెడ్డెమ్మ

అధ్యక్షతన మదనపల్లె మండల సర్వసభ సమావేశం గురువారం నిర్వహిం చారు.ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే నవాజ్ బాషా మాట్లాడుతూ సమా వేశం లో గ్రామాలలో నెలకొన్న సమస్యలపై సభా దృష్టికి తెచ్చి పరిష్కరిం చుకొనేందు కుసభా నిర్వహిస్తారని,ఇలాంటి సభలకే అధికారులు గైర్హాజరు కావడంపై మండి పడ్డారు. అలాంటి అధికారులపై తక్షణమే జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేయాలని ఎంపీడీవోను ఆదేశించారు. అనంతరం సభలో ఎంపీటీసీలు గ్రామాలలో నాటుసారా ఏరులై పారుతోందని, ఎక్సైజ్ సిబ్బంది నిర్లక్ష్యంతోనే యువత పక్కదారి పడుతున్నారని సభా దృష్టికి తెచ్చారు.స్పందించిన ఎమ్మెల్యే ఎక్సైజ్ అధికారులు తక్షణమే గ్రామాలలో నిఘా పెట్టి నిర్మూలించే తెలిపారు.ఈ కార్యక్రమంలో జడ్పిటిసి ఉదయ్ కుమార్, సర్పంచులు, ఎంపీటీసీలు అధికారులు పాల్గొన్నారు.

## గ్రామీణ క్రీడలను ప్రోత్సహించాలి

**విశాలాంధ్ర-రాయచోటిటౌన్:** నందమూరి తారక రత్న నటించిన సారధి సినిమా స్పెషల్ షో రాయచోటిలోని గౌతమ్ థియేటర్లో విద్యార్థిని, విద్యార్థులతో కలిసి మాజీ టిటిడి పాలకమండలి సభ్యులు, టీడీపీ నాయకులు సుగవాసి ప్రసాద్ బాబు వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచభూత క్రియేషన్స్ నందమూరి తారకరత్న హీరోగా నటించిన సారధి సినిమా బాగుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో సైతం కోకో క్రీడలను ప్రోత్సహించి నేటి విద్యార్థులకు తెలియ జేసే విధంగా సినిమా చాలా విజయవంతంగా ఉందని పేర్కొ న్నారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన సుగవాసి ప్రసాద్ బాబుకి యూత్ ఐకాన్ వినయ్ కుమార్ శాలువాతో సత్కరించి ఘనంగా స్వాగతం పలికారు. విద్యార్థులకు మంచి ప్రతిభను కనబరిచే చిత్రాన్ని విద్యార్థుల కోసం ఉచిత షో కు సహకరించిన ప్రసాద్ బాబుకు వినయ్ కుమార్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## ఉర్దూ కవి షేక్ మొహమ్మద్ హాషింకు అరుదైన గౌరవం

**విశాలాంధ్ర-రాయచోటిటౌన్:** స్టేట్ ఉర్దూ అకాడమీ ఆంధ్రప్రదేశ్ సెలక్షన్ కమిటీ రాష్ట్ర స్థాయి ఉర్దూ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు, లైఫ్ టైం అచీవ్మెంట్ అవార్డులను అన్ని జిల్లా ల లిస్ట్ లు గురువారం అమరావతి, విజయ వాడ లో ప్రకటించారు. ఇందులో అన్నమ య్య జిల్లా కేంద్రంలోని రాయచోటి పట్టణంలోని నేతాజీ సర్కిల్ వద్ద వున్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు ప్రముఖ ఉర్దూ కవి షేక్ మొహమ్మద్ హాషిం రాష్ట్ర స్థాయి లైఫ్ టైం అచీవ్మెంట్ మెంట్ అవార్డు కు ఎంపిక అయ్యారు. గతంలో జిల్లా బెస్ట్ టీచర్ అవార్డు, సర్సయ్యద్ అవార్డు, ఫక్రే ఉర్దూ అవార్డు , సాహితీ సేవలకు గుర్తింపుగా అంజుమన్ తరఖీ? ఉర్దూ వారిచే లైఫ్ టైం అచ్యుమెంట్ అవార్డు, తీసుకున్నారు. మండల స్థాయి నుండి అంతర్జాతీయ స్థాయి కవి సమ్మేళనాలలో కవిగా పాల్గొన్నారు. ఈయన "సర్వరే కౌనైన్" అనే కవితా పుస్తకాన్ని రచించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరఫున విద్యాశాఖలో నిర్వహించే ప్రతి కార్యక్రమానికి స్టేట్ రిసోర్స్ పర్సన్ గా వ్యవహరించారు. ఉర్దూ మీడియం పాఠ్యపుస్తకాలను రచించారు. మరియు సర్వ శిక్ష అభియాన్ లో మదరసా మొబలైజింగ్ ఆఫీసర్ గా సేవలను అందించారు. ఈ అవార్డు ప్రధానోత్సవం లి"నేషనల్ ఎడ్యుకేషన్ డే "జాతీయ విద్యా దినోత్సవం నాడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 11న గుంటూరు లోని మైనారిటీ ఎడ్యుకేషన్ సెమినార్ రోజు ముఖ్యమంత్రిసీఎం వైస్ జగన్ మోహన్ రెడ్డి చేతుల మీదుగా అందుకోనున్నారు.

## గుంతల రోడ్లను పూడ్చి ప్రజల ప్రాణాలను కాపాడాలి

- జీఓ నెంబర్ 21 ని రద్దు చేయాలి
- ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి: ఏఐటీయూసీ

**విశాలాంధ్ర -రాజంపేట:** రాష్ట్రంలో పట్ట ణాలలో నగరా లలో గ్రామీణ ప్రాంతాల్లో ప్రధా న మైన రోడ్లమీద గుంత లు ఏర్పడిన కారణంగా ప్రమా దాలు జరిగి, ప్రజల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయని, తక్షణమే గుంతలు పడిన రోడ్లను పూడ్చి,ప్రజల ప్రాణాలను కాపాడాలని ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.ఎస్ రాయుడు, రాజంపేట పట్టణ కార్యదర్శి సికిందర్ డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ ఆటో వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సమితి పిలుపు మేరకు గురువారం రాజంపేట పాత బస్టాండ్ దగ్గర ఆటో స్టాండ్ వద్ద ఆటో డ్రైవర్లు ఏఐటీయూసీ నాయకులు నిరసన తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆటో కార్మికులపై భారీ యజమానాలు విధించేలా రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓ నెంబర్ 21 ని రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు.కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మోటార్ వెహికల్ చట్టసవరణతో మొత్తం ట్రాన్స్ పోర్ట్ రంగమే సంక్షోభం లోకి పోయిందన్నారు.ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక,ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఆటో కార్మికులు పోరాటం సాగించాలని కోరారు ఆటో కార్మికులకు ఆటోలు నిలుపుకోవడానికి స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు నాగేశ్వరరావు,యల్లారెడ్డి, బ్రహ్మయ్య, భాషా, వెంకటేష్, బాలకృష్ణ, సుబ్బారాయుడు, ఖాదర్ భాషా తదితరులు పాల్గొన్నారు.

## కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపు సర్వేపై శిక్షణ

**విశాలాంధ్ర-వాల్మీకిపురం:** కుష్టు వ్యాధి "మైక్రో బ్యాక్టీరియం లేప్రే" అనే బ్యాక్టీరియా వల్ల వచ్చే అతి సామాన్యమైన వ్యాధని గర్నిమిట్ట ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ శ్యామల పేర్కొన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన సిబ్బంది శిక్షణ సమావేశంలో ఆమె మాట్లాడుతూ కుష్టు వ్యాధి ఎవరికైనా రావచ్చునని, దీనికి జాతి, వయస్సు, లింగభేదం లేదని, ఇది వంశపారం పర్యం కాదని, శాపం - పాపం అంతకన్నా కాదని, దీనికి ఉచితంగా మందులు లభిస్తాయని తెలిపారు. ఈనెల 15వ తారీకు నుండి డిసెంబర్ నెల ఐదో తారీకు వరకు 21 రోజులు పాటు కుష్టు వ్యాధిగ్రస్తుల్ని గుర్తించేందుకు ప్రత్యేక సర్వే కార్యక్రమం నిర్వహిస్తున్నారన్నారు. ఆషా కార్యకర్త, సచివాలయ మేల్ వాలంటీర్ తమ పరిధిలోని ఇంటింటిని సందర్శించి, ప్రతి కుటుంబ సభ్యున్ని పరీక్షించి కుష్టు వ్యాధి లక్షణాలు ఏమైనా గుర్తిస్తే, వారిని అనుమానితులుగా భావించి వైద్యాధికారి వద్దకు రిఫర్ చేయడం జరుగుతుందన్నారు. చర్మం పైన స్పర్శ లేని మచ్చలు, మందమైనా మెరిసే జిడ్డు గల చర్మము, చెవులపై, వీపుపై ఎదపై నొప్పిలేని బొడిపెలు, కనురెప్పలు మూతపడకపోవడం , అరచేతులు అరికాళ్ళలో స్పర్శ కోల్పోవడం, చల్లని లేదా వేడి వస్తువుల్ని గుర్తించలేకపోవడం, చేతుల నుండి వస్తువులు జారిపోవడం, కాళ్లకు చెప్పులు జారిపోవడం, తెలియకుండానే చేతులు, కాళ్లలో బొబ్బలు రావడం, చేతివేళ్లు కాలి వేళ్ళ లో అంగవైకల్యం రావడం ఈ వ్యాధి లక్షణాలని, ఎవరికైనా ఈ లక్షణాలు ఉంటే ఆరోగ్య కార్యకర్తలకు తెలియ జేయా లని సూచించారు. ప్రజలందరూ తమ చర్మంపై కలిగే మార్పుల పట్ల అవగాహన కలిగి ఉండాలని, స్వీయ పరీక్ష చేసుకొని అనుమానం ఉంటే వెంటనే వైద్యుల్ని సంప్రదిం చాలన్నారు. సర్వే కార్యక్రమంలో పాటించవలసిన విధానము, నివేదికలు రూపొందిం చడం గురించి సిబ్బందికి క్షుణ్ణంగా శిక్షణ నిచ్చారు. కార్యక్రమంలో గర్నిమిట్ట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో నూతనంగా నియమింపబడిన వైద్యురాలు డాక్టర్ రేష్మ, సామాజిక ఆరోగ్య అధికారిణి భాగ్యలక్ష్మి, పబ్లిక్ హెల్త్ నర్స్ రమాదేవి, ఆరోగ్య విస్తరణ అధికారులు కృష్ణమ్మ, కృష్ణయ్య, పర్యవేక్షకులు పురుషోత్తం, చెన్నమ్మ, సి.హెచ్.ఓ.లు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలు, సచివాలయ మేల్ వాలంటీర్లు పాల్గొన్నారు.

## విద్యార్థులు సైన్స్‌పై అభిరుచిని పెంచుకోవాలి: ఎమ్మెల్యే

**విశాలాంధ్ర - వాల్మీకిపురం :** విద్యార్థులు సైన్స్ పట్ల అభివృద్ధిని పెంచుకొని అధ్య య నాలు సాగించాలని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. వాల్మీకిపురంలోని ఎన్టీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫిజిక్స్ విభాగం ఆధ్వర్యంలో గురువారం ' రీసెంట్ అడ్వాన్సస్ ఇన్ ఫంక్షనల్ మెటీరియల్స్ ' అనే అంశంపై మూడు రోజుల వర్క్ షాప్ ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి మాట్లాడుతూ సైన్స్ తోనే సమాజ అభివృద్ధి సాధ్యమని, విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలన్నారు. ఇష్టపడి చదివితే గొప్ప వ్యక్తులుగా, మేధావులుగా తయార వుతారని , విద్యార్థులు ఈ వర్క్ షాప్ లో శాస్త్రవేత్తల ఉపన్యాసాలను శ్రద్ధగా ఆలకించి, ఈ కార్యక్రమ స్ఫూర్తితో భవిష్యత్తులో శాస్త్రవేత్తలుగా తయారు కావాలన్నారు. కార్యక్రమ కన్వీనర్ ప్రొఫెసర్ జయశంకర్ మాట్లాడుతూ వాల్మీకిపురం లాంటి చిన్న ప్రాంతంలో ఇలాంటి ప్రతిష్టాత్మకమైన కార్యక్రమాన్ని నిర్వహించడం విద్యార్థుల అదృష్టమన్నారు. డిగ్రీ కళాశాలల రీజియన్ ఆర్జెడి నాగలింగారెడ్డి, ఎస్వీయూ రిజిస్ట్రార్ డాక్టర్ మహమ్మద్ మాట్లాడుతూ వర్క్ షాప్ లోని శాస్త్రవేత్తల ఉపన్యాసాలు విద్యార్థులకు స్ఫూర్తిదాయకం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ బాబు, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి, ఫిజిక్స్ అధ్యాపకులు గురు ప్రసాద్ , వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

## శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాలలో ఘనంగా అన్నమయ్య జిల్లా యువజన ఉత్సవాల నిర్వహణ

**విశాలాంధ్ర-రాయచోటిటౌన్:** అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి శ్రీ సాయి ఇంజ నీరింగ్ కళాశాలలో గురువారం జిల్లా యువ జన ఉత్సవాలు 2022 ఘనంగా నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలు మూలల నుండి స్కూల్స్ ఇంటర్ పాలిటెక్నిక్, ఇంజనీ రింగ్ కళాశాల విద్యార్థిని విద్యార్థులు ప్రభుత్వ ప్రైవే టు ఉపాధ్యాయిని ఉపాధ్యాయు లు, తల్లిదండ్రు లు పాల్గొన్నారు ఈ కార్యక్రమాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి రాఘవరెడ్డి స్వామి వివేకానందుని చిత్రపటానికి పూలమాల వేసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతరం బలోపేతమైనప్పుడే భావి భారత నిర్మాణం జరుగుతుందని పారిశ్రామికంగా సాంకేతి కంగా ఆర్థికంగా యువత ఆలోచనలు దేశాభివృద్ధికి దోహదపడతాయని అభిప్రా యపడ్డారు. ఉమ్మడి కడప జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి మాట్లాడుతూ యువజన ఉత్సవాల నిర్వహణ భాగంగా నిర్వహించిన జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీలను సద్వినియోగం చేసుకొని యువత అంది రంగాల్లో రాణించాలని అంది వచ్చిన అవకా శాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. శ్రీ సాయి విద్యాసంస్థల అసిస్టెంట్ డైరెక్టర్ ఎం సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ యువజన ఉత్సవాలను జయప్రదం చేసినందుకు జిల్లాలోని ప్రభుత్వ యంత్రాం గానికి కళాశాలల అధ్యాపకులకు విద్యార్థులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ అంశాల కోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థిని విద్యార్థులకు జ్ఞాపికలను ప్రశంసా పత్రాలను బహుకరించారు. ఈ కార్యక్రమంలో వివిధ కళాశాల విద్యార్థిని విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో రాయచోటి పట్టణ మున్సిపల్ చైర్మన్ షేక్ ఫయాజ్ భాష,ఒకటవ వార్డు కౌన్సిలర్ ఈశ్వర్ ప్రసాద్ పాల్గొన్నారు.

## చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

**విశాలాంధ్ర- నందలూరు:** మండలంలోని నల్లతిమ్మాయ్యపల్లి సచివా లయం నందు మండల అభివృద్ధి అధికారి సౌభాగ్యమ్మ గురువారం న్యాయసేవల పై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు . ఈ సందర్భంగా ఎంపీడీవో సౌభాగ్యమ్మ మాట్లాడు తూ బాల్యవివాహాలు నివారించాలని పల్లెల్లో ఎక్కువగా బాల్య వివాహాల ను ప్రోత్సహిస్తూ చిన్న పిల్లలను ఇబ్బందులు పాలు చేయడం జరుగుతుందని అలాంటి వారిపై కేసులు నమోదు చేస్తే వారికి ఒక సంవత్సరం పాటు జైలు శిక్ష , రెండు లక్షల వరకు జరిమానా విధిస్తారు అని అన్నారు. మహిళలను హరాస్మెంట్ చేయడం, ర్యాగింగ్ చేయడం వంటివి చేస్తే న్యాయ స్థానం కఠిన చర్యలు తీసుకుంటాయని తెలిపారు. అనంతరం అనంతరం నల్ల తిమ్మయ్య గారి పల్లి లోని పాఠశాల వెళ్లి మధ్యాహ్న భోజనం ను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమం లో పంచాయతీ కార్యదర్శి భ్రమరాంబిక, సచివాలయం సిబ్బంది, వాలంటీర్స్, ప్రజలు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ సాయినాధ మందిరం వార్షికోత్సవం

సాయినాధునిని దర్శించుకున్న ఎమ్మెల్యే మేడా, మున్సిపల్ చైర్మన్ పోలా

**విశాలాంధ్ర -రాజంపేట:** పట్టణ కేంద్రంలోని సాయినగర్ లో వెలసిఉన్న శ్రీ సద్గురు సాయినాధ మందిరం 23వ వార్షికోత్సవం ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా గురువారం నిర్వహించారు. ఉదయం శ్రీ సద్గురు సాయి బాబాకు ఆలయ అర్చకులు సత్యా స్వామి కాగడ హారతి,గణపతి పూజ, పుణ్యా వాచనం,అభిషేకాలు నిర్వహించారు.శ్రీ సద్గురు సాయినాధ మందిరం వార్షికోత్సవం సందర్భంగా ఆలయాన్ని ప్రత్యేక హంగులతో చూడ ముచ్చటగా అలంకరించారు.శ్రీ సద్గురు సాయినాధ మందిరం వార్షికోత్సవం సందర్భంగా రాజంపేట శాసన సభ్యులు మేడా మల్లికార్జున రెడ్డి,జడ్పీ చైర్మన్ ఆకెపాటి అమర్నాథ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులురెడ్డి తో పాటు వైకాపా నాయకులు కొండూరు శరత్ కుమార్ రాజు, జేసిబి సుబ్బారెడ్డి, పసుపులేటి సుధాకర్, ఉమామహేశ్వర్ రెడ్డి, సుబ్బారెడ్డి, విశ్వనాదరాజు,కౌన్సెలర్ శ్వేతారెడ్డి, మిరియాల సురేఖలు

పాల్గొన్నారు. అలాగే టీడీపీ సీనియర్ నాయకుడు, రాజు స్కూల్స్ విద్యా సంస్థల అధినేత చర్తి జగన్మోహన్‌రాజు పాల్గొని సాయిబాబా కు ప్రత్యేక పూజలు నిర్వహించారు.శ్రీ షిర్డీసాయి బాబాను దర్శించుకున్న రాజకీయ నాయకులను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. సాయిబాబా ను దర్శించుకునేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి ప్రదర్శనలు చేసి పూజలు నిర్వహించారు.ఆలయ కమిటీ ఆధ్వర్యం లో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.